తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం






సంపుటి :02, సంచిక : 346 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, మంగళవారం మార్చి 25, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




## ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయక చర్యలు

- సీనియర్ ఐఎఎస్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
- సిఎస్‌ను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాద ఘటనలో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు జరిగిన సహాయక చర్యల్లో పురోగతిపై సీఎం రేవంత్ సోమవారం మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టన్నెల్ వద్ద ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. టన్నెల్ వద్ద సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. నిపుణుల కమిటీ సూచనలను తీసుకుంటూ కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని రెస్క్యూ ఆపరేషన్‌లో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా

వివరాలు 2లో



## మహేశ్వరరెడ్డి వర్సెస్ పొన్నం

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** మీ మేనిఫెస్టో లో మూసి ప్రక్షాళన ఉంది, దానికి నిధులు ఎందుకు కేటాయించలేదు? అంటూ బిజెఎల్‌పి నేత మహేశ్వరరెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ మూసికి సంబంధించి నిధులు ఇస్తారా లేదా%ొ%? హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. మీరు మేనిఫెస్టోలో పెట్టిన మూసికి నిధులు ఇస్తారా లేదా..?, మూసి అభివృద్ధి తెలంగాణలో అంతర్భాగం కాదా? అని ప్రశ్నించారు. అనేక రాష్ట్రాల్లో కాలువల అభివృద్ధికి నిధులు ఇస్తున్నారని, గాంధీని వ్యతిరేకించే మీరు గాంధీ స్మృతివనంకి నిధులు ఇస్తారా లేదా..? తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. హైదరాబాద్‌కి

వివరాలు 2లో

## పల్లెల్లో పడేకేసిన పాలన

- సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలు
- పల్లెల దుస్థితిపై కేసీఆర్ మండిపాటు

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** కాంగ్రెస్ పాలనలో పల్లెన్నీ పట్టించుకునే నాథుడే లేడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కేటీఆర్. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో నెలకొన్న సమస్యలపై కేటీఆర్ స్పందించారు. అమ్మ పెట్టదు.. అడుక్క తిననివ్వదు.. అన్న చందంగా కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. పల్లెలు నాడు కేసీఆర్ పాలనలో ప్రగతి బాట పడితే.. నేడు 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధోగతి బాట పట్టాయని ధ్వజమెత్తారు. 14 నెలలుగా సర్పంచులు లేక



కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం

వివరాలు 2లో



## కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

- మూల్యాంకనంలో నాణ్యత లేదని పిటిషన్
- పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు.

వివరాలు 2లో

## ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

- నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు
- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి





## ఆచరణ సాధ్యమైన హామీలు ఇవ్వండి

- ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా..?
- అసెంబ్లీలో గళమెత్తిన అక్బరుద్దీన్

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి..ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా అంటూ అసెంబ్లీలో అక్బద్దీన్ గళమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో తన ప్రత్యేక శైలిలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, అవి అమలయ్యే విధానం, ప్రజలకు అందే ప్రయోజనాలను ఉద్దేశించి ఆయన నేరుగా ప్రభుత్వ తీరును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు ఫేకులు గురించి ఒక కథను

వివరాలు 2లో

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికకు షెడ్యూల్ విడుదల

### ఏప్రిల్ 23న పోలింగ్.. 25న ఫలితాలు

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 28న నోటిఫికేషన్ విడుదలకానుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అదే నెల 7న నామినేషన్లను పరిశీలించనున్నారు. నామి నేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. అదే నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. 25న ఫలితాలు ప్రకటిస్తారు.



## అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మ

### - సుప్రీం కోలీజియం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మను ఉంచుతూ..సుప్రీం కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున నోట్లకట్టలు బయటపడిన వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు పంపాలని అధికారికంగా సిఫారసు చేసింది. ఈ మేరకు సీజేఐ సంజయ్ ఖన్నా, న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సూర్య కాంత్, ఓసీ ఓకాతో కూడిన కొలీజియం అధికారిక ప్రకటన జారీ చేసింది. దీనికి మందు, జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ సోమవారం ఉదయం నిర్ణయం తీసుకుంది.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

# ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయారు. భారీగా బురద, నీరు ఉబకడంతో పాటు- ధ్వంసమైన టన్నెల్ బోరింగ్ మిషన్ పరికరాలు రెస్క్యూ ఆపరేషన్ ఛాలెంజింగ్‌గా మారాయి. అయినప్పటికీ సహాయక బృందాలు తీవ్రంగా కృషి చేసి ఘటన స్థలం వద్దకు చేరుకున్నాయి. టన్నెల్ వద్ద దాదాపు నెల రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఎట్టకేలకు 16వ రోజు ఓ కార్మికుడి డెడ్ బాడీని వెలికితీశాయి. మిగిలిన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## అక్రిడేషన్లు మరో 3నెలలు పొడిగింపు

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు సమాచారశాఖ కమిషనర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. అక్రిడేషన్ కార్డుల గడువును పొడిగించడం ఇది నాలుగోసారి. ఇప్పటికే అక్రిడేషన్ల పరిమితి, విధివిధానాలపై ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి ఓ నివేదిక సమర్పించారు.

# మహేశ్వరరెడ్డి వర్సెస్ పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన అంశాల్లో మీరు మేనిఫెస్టో లో పెట్టారని వెల్లడించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకుపోతున్నమని తెలిపారు. మూసి నిర్వాసితులను బలవంతంగా ఎక్కడ తొలగించడం లేదు, వారికి పునరావాసం కల్పిస్తూ అన్ని రకాల సహకారం ఇస్తున్నామని వెల్లడించారు. హైదారాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తామని మేనిఫెస్టోలో చెప్పారు మరి నిధులు ఎందుకు కేటాయించడం లేదు? అని ప్రశ్నించారు. ఏం లేకుండానే ప్రభుత్వం మీద బట్ట కాల్చి మీద వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మూసి పునరాభివృద్ధికి మీరు నిధులు కేటాయిస్తారా లేదా ..? మీరు మేనిఫెస్టో లో పెట్టిన విధంగా నిధులు ఎందుకు కేటాయించడం లేదని సూటిగా ప్రశ్నించారు. సిఎం ఈసా మూసి ఎక్కడైతే ప్రారంభమైందో అక్కడ బాపు ఘాట్ దగ్గర గాంధీ స్మృతి వనం కట్టి దేశంలోనే బాపు ఘాట్ అభివృద్ధి చేసుకోవాలని సిఎం ఆలోచన అని అన్నారు. అలా చేయడం వల్ల అక్కడ అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఒక నగరంలో రెండు ప్రాంతాలను కలుపుతూ నదులు పోయే ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందన్నారు. ఏదో దుర్బుద్ధి ఉందని ప్రభుత్వంను బదనం చేయడం తగదని బిజెఎల్పీ మహేశ్వరరెడ్డిపై మంత్రి పొన్నం మండిపడ్డారు.

# పల్లెల్లో పడేకేసిన పాలన

(మొదటి పేజీ తరువాయి)

లేదని మండిపడ్డారు. 12,754 గ్రామ పంచాయతీల్లో పాలన పడకేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని.. దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకవైపు తాగునీరు, మరోవైపు విద్యుత్ కోతలు ప్రజలను వెంటాడుతున్నాయని అన్నారు. హరితహారం మొక్కల హాహాకారాలు.. పంచాయతీల నిర్వహణకు కార్యదర్శుల ఆపసోపాలు పాడుతున్నారని పేర్కొన్నారు. హరితహారంలో మొక్కలు నాటించి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ, మొక్కల సంరక్షణకు ట్రాక్టర్ల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాల ఏర్పాటుతో దేశానికే అదర్శంగా నిలిచి అవార్డులు అందుకున్న తెలంగాణ పల్లెలు.. నేడు కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యంతో నిధులు లేక వెల వెలబోతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఆచరణ సాధ్యమైన హామీలు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

వినిపించారు. ఈ కథ ప్రభుత్వాలు చేసే వాగ్దానాలను నమ్మే పరిస్థితి ఎంత అసాధారణంగా మారిందో చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. అయితే, ఆ హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులు లేవు. 'ఇది చేస్తాం, అది ఇస్తాం' అంటూ ప్రజలను విశ్వసింపజేసేలా హామీలు ఇస్తూ, ఆర్థిక భారం పెంచుకుంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోతోందని ఆయన అన్నారు. కేవలం ప్రచార హామీలతో కాకుండా, నిజంగా అమలు చేయగలిగే విధంగా హామీలు ఇచ్చి, ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేను ఎవరినీ లక్ష్యంగా వ్యాఖ్యలు చేయడం లేదు, కానీ మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చాలా హామీలు ఇచ్చినా, ప్రయోజనం పొందే స్థాయిలో ప్రజలకు అందడం లేదు. ఈ వ్యాఖ్యల ద్వారా, ప్రభుత్వ విధానాలను పునఃసమీక్షించి, అసలు లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు పరిశీలనాత్మకంగా, ప్రజలకు నిజమైన ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల పేపర్లు దిద్దించారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు తెలిపారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీ-జీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈనెలలోనే గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలతో పాటు- గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్-2 రాత పరీక్షల మార్కులు విడుదలయ్యాయి. అలాగే మార్చి 14న గ్రూప్-3 ఫలితాలను కూడా విడుదల చేసింది. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్-3 సర్వీస్‌ల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్-3 ఫలితాలను టీ-జీపీఎస్సీ విడుదల చేసింది.

# ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

- నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు
- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** ఎల్ఆర్ఎస్ గడువు పొడగించే ఆలోచన లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పర్మిషన్ ఇప్పుడు కాకుండా ఇళ్ళు కట్టేటప్పుడు కావాలంటే అప్పుడు వందశాతం ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన మేర స్పందన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువు మార్చ్ 31 వరకు ఉందని.. ఆలోపు చేసుకున్న వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో భూవిలువలను పెంచబోతున్నామని తెలిపారు. త్వరలో భూ సర్వే కోసం ప్రతీ మండలానికి సర్వేయర్, డిప్యూటీ- సర్వేయర్‌ను నియమిస్తామని.. అలాగే లైసెన్డ్ సర్వేయర్‌లకు అవకాశం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది లైసెన్డ్ సర్వేయర్లు ఉన్నారని వీరికి శిక్షణ ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు. సాదాబైనామాల విషయంలో కొత్త దరఖాస్తు లను స్వీకరించమని తేల్చి చెప్పారు. పాత దరఖాస్తులలో 13 లక్షల అప్లికేషన్లను గత ప్రభుత్వం తరస్కరించిందని దరఖాస్తు తిరస్కరణకు గురైనవారు అప్పిలేట్ ఆథారిటిలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. కేంద్రం ప్రధాని అవాస్ యోజన కింద అర్బన్ ఏరియాలో 1 లక్ష 13 వేల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అర్బన్ ఏరియాలో కట్టే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుందని.. మిగతాది రాష్ట్ర



ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రూరల్ ఏరియాకు సంబందించి కేంద్రం ఇంకా ఎలాంటి క్లారిటీ- ఇవ్వలేదని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై మంత్రి పొంగులేటి స్పష్టత ఇచ్చారు. తనకు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మధ్య ఎలాంటి సమస్య లేదని చెప్పారు. అనిరుధ్ రెడ్డితోనే కాకుండా ఇతర ఏ ఎమ్మెల్యేతో కూడా విభేదాలు లేవని వివరణ ఇచ్చారు.

# పోలీసుల విచారణకు హాజరైన యాంకర్ శ్యామల

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేసినందుకు పలువురి యూట్యూబర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యాంకర్ శ్యామల న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు శ్యామల. అయితే విచారణకు వచ్చిన యాంకర్ నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాంకర్ శ్యామలపై పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణకు రావాల్సిందిగా గతంలో పోలీసులు ఒకసారి నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులకు ఆమె స్పందించలేదు. ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే క్వాష్ పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చారు. శ్యామలను అరెస్టు చేయవద్దని, నోటీసులు ఇచ్చి విచారించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. అలాగే సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని హైకోర్టు చెప్పిన నేపథ్యంలో ఉదయమే శ్యామల విచారణకు వచ్చారు.

# తానా సదస్సుకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా కాన్ఫరెన్స్ అమెరికాలో జూలై 3 నుంచి 5 వరకు జరగనున్నది. ఇందుకోసం ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సిఎం రేవంత్‌ను కూడా తానా ప్రతినిధులు ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి 24 వ తానా సదస్సుకు ఆహ్వానించారు.

# ఇచ్చిన వాగ్దానాలు అడిగితే నిర్బంధాలా..?

**- అరెస్టు చేసిన ఆశావర్కర్లను వెంటనే విడుదల చేయాలి : హరీశ్‌రావు**

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** అక్రమంగా అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్‌చేశారు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేయడమే వారు చేసిన నేరమా? వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఆశా సోదరీమణుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎందుకింత నిర్బందం, ఎందుకింత నిరంకుశత్వం? ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా? హామీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని 15 నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలు గుర్తించారన్నారు. కాంగ్రెస్ చేసిన నయ వంచనపై ఎక్కడిక్కడ నిలదీస్తున్నారని పేర్కొన్నారు. నిలదీత నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ తప్పించుకుంటుందని ఎద్దేవా చేశారు. గొంతెత్తిన వారిని అక్రమంగా అరెస్టులు చేస్తూ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచింది, రెండు పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టింది. ఇంకా ఎన్నాళ్లు హామీలు అమలు చేయకుండా సాకులు చెబుతారు రేవంత్ రెడ్డి గారూ.. ఎన్నికల హామీ ప్రకారం, ఆశా వర్కర్ల వేతనాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు.

# హైడ్రాపేరుతో దందాలు చేస్తే కఠిన చర్యలు

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక**

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** హైడ్రా పేరుతో లావాదేవీలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. ఇలాంటి దందాలను చూస్తూ ఊరుకునేది లేదని సోమవారం ఆయన స్పష్టం చేశారు. వంశీరామ్ బిల్డర్స్‌పై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ విషయంపై చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క వంశీ రామ్ బిల్డర్స్ మాత్రమే గాకుండా, రాజ్‌పుష్ప వంటి బిల్డర్స్‌కు కూడా బఫర్ జోన్లలో డంపింగ్ చేశారని రంగనాథ్ తెలిపారు. వారందరికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. హై డ్రా పేరుతో సెటిల్ మెంట్లు- చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే చాలా కేసులు నమోదయ్యాయని అలాంటి అధికారులు ఉంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు.

# కెసిఆర్‌పై అసత్య ఆరోపణలు

**- బండి సంజయ్‌పై పోలీసులకు బిఆర్ఎస్ ఫిర్యాదు**

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణమాజీ సీఎం కేసీఆర్ దొంగ నోట్లు ముద్రించి ఎన్నికల్లో పంచాడంటూ కేంద్రం మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ మండిపడింది. ఈ మూరకు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్‌తో పాటు పలువురు నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్‌ను ఉద్దేశించి బీదర్‌లో దొంగ నోట్లు ప్రింటింగ్ చేసే మిషన్ ఉందంటూ చేసిన ఆరోపణలు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్నాయన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. తాను కేంద్రమంత్రి అనే విషయం మర్చిపోయి ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న బండి సంజయ్ తీరు సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు డా. కుర్వ విజయ్ కుమార్, అశ్విన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువు

- ఎంఎంటీఎస్ ఘటనపై బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే ఘటనలని మండిపాటు

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మహిళలకు రోజురోజుకూ రక్షణ లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైల్వే ఎస్పీ చందన దీప్తితో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తనను రక్షించుకునేందుకు రైలు నుంచి దూకిన యువతి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని రైల్వే ఎస్పీ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై అత్యాచార ఘటనలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని, ఎక్కడా భద్రత లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్, మెట్రో రైలులో కూడా వేధింపులు జరగటం బాధాకరమని, ఇప్పటికైనా లోకల్ రైల్‌ల్లోనూ భద్రతను పెంచాలని ఆమె డిమాండ్‌చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని తాము పదేపదే చెబుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కవిత డిమాండ్ చేశారు.



# పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై అధికారుల విచారణ

**- పరీక్షా కేంద్రం చీఫ్ గోపాల్, డిపార్ట్‌మెంట్ అధికారి సస్పెండ్**

**హైదరాబాద్,24(తెలుగు వెలుగు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే తొలి పరీక్ష రోజే.. ఎగ్జాం ప్రారంభమైన 10 నిమిషాలకే తెలుగు ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లీకేజ్ వ్యవహారంపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. నకిరేకల్ గురుకుల పాఠశాలలో తెలుగు ప్రశ్నపత్రం లీకైనట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు కూడా. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తొలుత తేల్చినా.. పోలీసులు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నప్పటికీ పరీక్ష సెంటర్లోకి ఫోన్ ఎలా వచ్చిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఇద్దరు అధికారులను విధుల నుంచి తొలగించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్‌గా ఉన్న టీజీటీ సుధారాణిని కూడా సస్పెండ్ చేశారు. అంతేకాకుండా ప్రశ్నాపత్రం ఇచ్చిన విద్యార్థిని కూడా డీబార్ చేశారు. ఇప్పటికే ప్రశ్నపత్రం లీక్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో ఓ బాలుడు, జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు ఉన్నారు. పరీక్ష జరుగుతున్న గది వద్దకు బాలుడు గోడ దూకి వచ్చినట్లు తెలుస్తుంది. అనంతరం విద్యార్థి పరీక్ష రాస్తుండగా కిటికీలో నుంచి ప్రశ్నపత్రం ఫొటో తీసి, అనంతరం ఈ ప్రశ్నపత్రం కాపీని ఆ బాలుడు జిరాక్స్ కేంద్రంలో ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, జిరాక్స్ యంత్రం, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తన ప్రమేయం లేకపోయినా డిబార్ చేశారని బాధిత విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని, తానేం తప్పుచేశానని లబోదిబోమని విలపిస్తున్నాడు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం, 25 మార్చి 2025



## శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం... అన్నప్రసాద వితరణ

### - సీజీఆర్ ట్రస్ట్- గుమ్మడిదల



**గుమ్మడిదల:** మున్సిపల్ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈరోజు స్వామివారి కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గారు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. భక్తులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాము...

## శంకర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తెలుగు వెలుగు మార్చి 24 శంకర్ పల్లి:** మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి నేడు అమెరికా వెళ్తుండంతో వారికీ సన్మానించి వీడ్కోలు పలికారు మాజీ మార్కెట్ డైరెక్టర్ మిరియాల రామకృష్ణ,, నాయకులు సా త రాఘవేందర్, జి రామ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, మధుకర్ రెడ్డి పాల్గొన్నారు



లోక్ సత్తా పార్టీ సహా వ్యవస్థాపకుల్లో ఒకరైన సీనియర్ నాయకులు పెద్దలు కీర్తిశేషులు జోగినపల్లి కృష్ణా రావు గారి సంతాప సభ కుక్కట్ పల్లి ఇతిహస్ హెూటల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ గారు, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి నాగిరెడ్డి గారు, వి వి రావు గారు, గొట్టిముక్కల వెంగళరావు గారు పాల్గొని వక్తలుగా ప్రసంగించారు, జె .కృష్ణారావుతో వారి కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు, సమాజం లో బాధ్యత గల పౌరుడిగా, కుటుంబ వ్యవస్థ నీ విలువలతో నడిపించిన ఇంటి పెద్దగా, విద్యార్థుల భవిష్యత్తుని విద్య , విజ్ఞానము, వినయము అనే సద్గుణాలతో తీర్చి దిద్దిన ఉపాధ్యాయుడిగా , లోక్ సత్తా పార్టీ ద్వారా సమాజంలో మార్పు కోసం కృషి చేసిన సంస్కరణ వాదిగా పరిపూర్ణం గా వారు జీవించారని వక్తలు కొనియాడారు అన్నారు.

## ఆలయ అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతలకు కృతజ్ఞతలు... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని కూకట్పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు పేర్కొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన%శీ% ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీఆంజనేయ స్వామి శ్రీ గరుత్మంతుడు స్వామి వార్ల విగ్రహాల కోసం కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రెండు లక్షల రూపాయలు, కూకట్పల్లికి చెందిన మాధవరం రామచంద్ర రావు లక్ష రూపాయల విరాళములను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తూము శ్రావణ్ కుమార్, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ తులసి రావు, మర్యాద అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బొంతపల్లి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

### - గర్భగుడి ద్వారాలను విరాళంగా అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**గుమ్మడిదల:** మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరన్న గూడెం.. ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి-సంధ్యా దంపతులు స్వామివారి అభిషేకం, పూజా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా సొంత నిధులతో ?1,20,000 విలువైన గర్భగుడి ద్వారాలను విరాళంగా అందించారు.ఈ సందర్భంగా దేవస్థానం పూజారులు వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు. భక్తుల క్షేమసంతోషాలు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆలయ ఈవో శశిధర్, చిమ్ముల లలిత నరసింహారెడ్డి దీపా నరేందర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నబోయిన వేణు, అభి శెట్టి రాజశేఖర్, తుపాకుల రాజు, గోపాల్, గణేష్ అప్పు, రమేష్, సింహారెడ్డి, నరహరి, రవీందర్ రెడ్డి,సూర్యనారాయణ, చంద్రశేఖర్, అశోక్, వినోద్, నాగేష్, నల్లురి యాదగిరి, ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా కార్యాలయం.. వరల్డ్ టిబి డే, 24th మార్చ్ 2025





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లా ప్రజా పరిషత్ నుండి %ఐఎూ ఎూ% ఆఫీస్ వరకు ర్యాలీ ని శ్రీమతి ఆర్. డి. మాధురి, అడిషనల్ కలెక్టర్ గారు ప్రారంభిచటం జరిగింది. ఈ ర్యాలీ లో డి యమ్ హెచ్ ఓ డాక్టర్ జి. గాయత్రి దేవి గారు, డి టి సి ఓ డాక్టర్ సి ఎచ్. అరుణ కుమారి గారు, డెమో ప్రసాద్ గారు, డిప్యూటీ డెమో శ్రీమతి మంగ గారు మెడికల్ కాలేజీ విద్యార్థులు మరియు పారామెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొనటం జరిగింది. డి.యమ్.ఎచ్.ఓ. ఆఫీస్ నందు జరిగిన మీటింగ్ లో ముఖ్య అతిథి గా శ్రీ. బి. రమేష్, సీనియర్ సివిల్ జడ్జ్ గారు పాల్గొన్నారు, టిబి వ్యాధిని మొదటిదశలోనే గుర్తించి పూర్తికాలం చికిత్స తీసుకోవాలి అని సందేశం యిచ్చారు, డాక్టర్. జి. గాయత్రి దేవి, డి.యమ్.ఎచ్.ఓ గారి అధ్యక్షతన వహించారు. డి.యమ్.ఎచ్.ఓ గారు, జిల్లాలో ఉచితంగా లభిస్తున్న క్షయ నిర్ధారణ పరీక్షలను అందరూ ఉపయోగించుకొని టిబి రహిత సమాజం నిర్మించటానికి అందరూ కృషి చేయాలనీ చెప్పటం జరిగింది. యిట్టి కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సి ఎచ్. అరుణ కుమారి గారు జిల్లాలో అందిస్తున్న క్షయ వాది నివారణ చర్యలు మరియు క్షయ వ్యాధి గ్రస్తులకు అందిస్తున్న స్కీమ్స్ గురించి వివరించటం జరిగింది. క్షయ వ్యాధి రోగులకు ప్రధానమంత్రి టిబి ముక్త్ అభియాన్ క్రింద నిక్షయ్ మిత్రాల ద్వారా న్యూట్రిషన్ కిట్స్ అందివ్వటం జరుగుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమం లో %ఆణఎూ% డాక్టర్ సంగారెడ్డి గారు, డాక్టర్ సంధ్య రాణి డిప్యూటీ, డి.యమ్.ఎచ్.ఓ గారు , %ఆణూ% డాక్టర్ మహేందర్ రెడ్డి, శ్రీ యమ్, ప్రసాద్, డెమో గారు, చక్రపాణి గారు, వైద్య ఆరోగ్య శాఖా సిబంది మరియు నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. నిక్షయ్ మిత్రాల ద్వారా న్యూట్రిషన్ కిట్స్ అందివ్వటం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్షయ నివారణ సిబ్బంది కి, టిబి అలెర్ట్ %చీ+ూ% కు, భవ్య %చీ+ూ% కు, టిబి ఛాంపియన్ లకు మరియు నిక్షయ మిత్రలకు సన్మానించి మెమెంటోస్ ప్రదానం చేయటం జరిగింది

## రాజ్యాంగ పరిరక్షణ కోసం జన చైతన్య యాత్ర సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ధనలక్ష్మి, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి





**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి నారాయణఖేడ్ మార్చి 24:** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారి నివాసంలో ఈరోజు రాజ్యాంగ పరిరక్షణ కోసం జన చైతన్య పాదయాత్ర ఉంటుందని "జై బాబు-జై భీమ్-జై సంవిధాన్" అభియన్ ర్యాలీ పేరుతో ఈ కార్యక్రమం నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మరియు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కార్ గారి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ లో నిర్వహించడం జరుగుతుందని నారాయణఖేడ్ నియోజకవర్గ "జై బాబు-జై భీమ్-జై సంవిధాన్"అభియన్ ర్యాలీ ఇంన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీమతి ధనలక్ష్మి గారు అన్నారు నారాయణఖేడ్ నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే గారి నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ యాత్ర కోసం గ్రామ పట్టణ నియోజకవర్గ ప్రతి పల్లెపల్లెన ప్రతి గడప గడపకు పాదయాత్ర ఉంటుందని మహాత్మా గాంధీ శతాబ్ద జయంతిలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు అలాగే స్వతంత్ర సమరయోధులను అవమానిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రంలోని బిజెపి సర్కార్ వ్యవహరిస్తుందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం అని అన్నారు మహనీయుల ఆశయాలను కాపాడడంతోపాటు ప్రజలకు స్వేచ్ఛ ప్రసాదించి రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా "జై బాబు-జై భీమ్-జై సంవిధాన్" అభియాన్ ర్యాలీ నిర్వహిస్తున్నారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వారితో పాటు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి మరియు నారాయణఖేడ్ నియోజకవర్గ వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మరియు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్సీ సెల్,ఎస్టీ సేల్ నాయకులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వాసవి స్వచ్ఛంద సంస్థ ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్‌ను ప్రారంభించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** వేసవిలో సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపాలిటీకి అందజేసిన ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్ ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి , క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా ఎండాకాలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మున్సిపాలిటీకి ట్యాంకర్ ను ద్వారా ప్రతిరోజు మంచినీటి సరఫరా వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలిపారు. చలికాలంలో వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు చలి నుండి కాపాడడం కోసం వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వాసవి స్వచ్ఛంద సంస్థ జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో వాసవి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తోపాజి అనంత కిషన్, మున్సిపల్ కమిషనర్ ఎస్ సి వి కె చవాన్, వాసవి స్వచ్ఛంద సంస్థ, సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారంలో మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి -కామ్ - జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు మరమ్మత్తుల పనులు


- ప్రారంభించిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,డి శ్రీధర్ రెడ్డి, బార్ మెంబర్స్, అడ్వకేట్స్ మరియు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్





**జిన్నారం:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి -కామ్ - జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన మరమ్మత్తు పనులను ఈరోజు ప్రారంభించడం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు, విష్ణువర్ధన్ రెడ్డి, డి శ్రీధర్ రెడ్డి మెంబర్స్, అడ్వకేట్స్ మాట్లాడుతూ గతంలో జిన్నారం మండలంలో కోర్టును మంజూరు చేసిన హైకోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ.హైకోర్టు న్యాయవాది మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. ప్రతాప్ రెడ్డి గారికి కూడా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ. శాశ్వత భవనం ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలికంగా ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. ఈ కోర్టు నాలుగు పోలీస్ స్టేషన్లో 3 మండలాలను కలుపుకొని జూనియర్ సివిల్ జడ్జి -కామ్- జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేయడం జరిగిందని తెలుపుతూ అలాగే గతంలో కోర్టుకు వెళ్లాలంటే దాదాపు 50 కిలోమీటర్లు ప్రయాణించి కోర్టుకు వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. అది దృష్టిలో ఉంచుకొని జిన్నారం మండల కేంద్రంలో నూతన కోర్టును మంజూరు చేయడం చాలా సంతోషకరమని హర్షం చేశారు.మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ జిన్నారం మండల కేంద్రానికి కోర్టును తీసుకురావడానికి తన వంతు కృషి తను చేశానని మూడు మండలాలను నాలుగు పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న కేసులను జిన్నారం మండల కేంద్రంలో పరిష్కరించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ఏళ్ల తరబడి కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి దూర ప్రయాణాల చేయలేక ఇబ్బంది పడుతున్న వారికి మేలు జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి. నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి. జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్. అడ్వకేట్లు శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్, వి శ్రీనివాస్, సత్యనారాయణ, బాలకిషన్ ఏజీపీ సుధాకర్, మధుశ్రీ, నాగరాజు, సాయి, రామకాంత్ వెంకట్రామిరెడ్డి. నాయకులు మ్యాదరి శంకరయ్య కొరబోయిన నరేష్ యనగండ్ల నరేందర్ ప్రతాప్ రెడ్డి కోటేష్ గౌడ్ పల్నాటి భాస్కర్ రాజిరెడ్డి గోకర్ వెంకటేష్ ప్రవీణ్ వడ్ల నరేష్ యాదగిరి కంది ప్రవీణ్.వెంకటేష్ అశోక్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు... ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ





**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు. సత్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్, కేపిహెచ్బి కాలనీలోని వృద్ధులకు, ఉదయం పూట అల్పాహారం, మంచినీళ్ల ప్యాకెట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ వృద్ధులందరికీ మనశ్శాంతిని, ఆరోగ్యాన్ని, సంపూర్ణ ఆనందాన్ని సదా ఇవ్వాలని, ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలియజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హెూల్ ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టి పేద మధ్యతరగతి ప్రజలను తమ వంతుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఇన్చార్జిలు అరవింద్, దేశెట్టిరమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు-వెలుగు



# జాతీయ సగటు కంటే తక్కువ క్యాన్సర్ కేసులు నమోదుగా తేల్చిన సర్వే

● ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న కలెక్టర్



**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి) :** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ పెరుగుదలపై ఏపీ శాసనసభ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లేవనెత్తిన సమస్యకు స్పందిస్తూ జిల్లా అధికార యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా తక్షణ చర్యల్లో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. సోమవారం బలభద్రపురం సచివాలయం -3 లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ బలభద్రపురంలో జాతీయ సగటు రేటు కంటే తక్కువగా కేసులు ఉన్నాయని తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో గ్రామంలో సర్వే నిర్వహించబడిందని చెప్పారు. 31 వైద్య బృందాలు, బృందంలో 17 వైద్యాధికారులు 31 బృందాలుగా ఏర్పడి (ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు) గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య వివరాలు నమోదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఇంటింటి సర్వేలో 38 మంది క్యాన్సర్ అనుమానిత కేసును గుర్తించడం జరిగిందని వీరికి తదుపరి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా పదిమందికి చెందిన వివరాలు రావడం జరిగిందని వారికి ఎటువంటి క్యాన్సర్ లేదని నిర్ధారణ అయిందని మిగిలినవి కూడా ఇదే ఫలితాలు వస్తాయన్న ఆశాభావాన్ని కలెక్టర్ వ్యక్తం చేశారు. హెూమీ బాబా క్యాన్సర్ ఇనిస్ట్యూట్ విశాఖపట్నం నిపుణులు సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ సగటు ప్రకారం ప్రతి పది వేల మందికి 30 క్యాన్సర్ కేసులు ఉండటం జరుగుతుందని గణాంకాల ద్వారా తెలుస్తుందని ప్రశాంతి చెప్పారు. గ్రామంలో 17 మంది క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నారని ఇంటింటి సర్వేలో 38 అనుమానత కేసులు గుర్తించడం జరిగిందని వీరికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని ఆమె చెప్పారు. రానున్న మూడు రోజులు క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ద్వారా అనుమానిత కేసులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి తదుపరి నిర్ధారణ పరీక్షలు నిమిత్తం ఉన్నత ఆసుపత్రులకు పంపడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. తదుపరి ఎమ్మెల్యే సూచనల మేరకు ఇంటింటికి రక్త నమూనాలు సేకరించి పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. తృతీయ స్థాయిలో ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ప్రకారం నిర్ధారణ తర్వాత ఏమైనా అనుమానస్పద కేసులు సానుకూలంగా మారితే ప్రభుత్వ ఆసుపత్రులు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఎంప్యానల్డ్ హాస్పిటల్ లో అందుబాటులో ఉన్న చికిత్సా విధానంపై ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో లేవనెత్తిన సమస్య విషయమై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని రానున్న రోజుల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. ప్రజలు కూడా సహకరించి పరీక్షలకు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు,డా. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ కోఆర్డినేటర్ ప్రియాంక, డాక్టర్ రాజీవ్, జిజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ ప్రశాంత్, రంగరాయ వైద్య కళాశాల హెచ్ ఓ డి డాక్టర్ పి సుజాత, డాక్టర్లు కేశ్యామల, దీపక్, తరుణ్, డోలారోసా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్









**గుమ్మడిదల:** మండలం బొంతపల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి బ్రహ్మో త్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట సుధా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. వారు మాట్లాడుతూ భక్తుల నమ్మకంతో ఆలయ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని, ప్రజలంతా శాంతి, సంపదలతో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు.

# రెడ్డి సురేష్ శర్మకు పారాయణ బృందం సత్కారం

**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** అనపర్తి మండలం కుతుకులూరు శ్రీ పార్వతి సమేత కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ భగవద్గీత పారాయణం బృందం ఆధ్వర్యంలో తాడి చాముండేశ్వరి సత్తిరెడ్డి దంపతుల నేతృత్వంలో రెడ్డి సురేష్ శర్మ ని ఘనంగా సత్కరించారు.శ్రీ భూ కైలాస్ రిలీజ్ ట్రస్ట్ బెంగళూరు,భోగ లింగేశ్వర ధార్మిక ట్రస్ట్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో కోటి పార్థివ శివ లింగాల యజ్ఞంలో భాగంగా చివరి రోజు అనపర్తి సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి సురేష్ శర్మ ని పూలమాల, శాలువా, జ్ఞాపికతో భగవద్గీత పారాయణం సత్కరించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.



# ఇస్కాన్ సదాశివపేట ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన గీతా ప్రవచనం

● 1500 మంది భక్తుల సందడి









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: సదాశివపేట, మార్చి 23:** ఇస్కాన్ సదాశివపేట ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా ప్రవచనం కార్యక్రమం అత్యద్భుత విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమానికి 1,500 మందికి పైగా భక్తులు హాజరై భగవద్గీత గీతామృతాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమానికి శ్రీమన్ ప్రణవానంద ప్రభుజీ వక్తగా హాజరై భగవద్గీత మహత్యాన్ని, ధార్మిక జీవన విధానాన్ని విశదీకరించారు. అలాగే, ఇస్కాన్ సదాశివపేట అధ్యక్షులు శ్రీమాన్ శ్రీరామ్ ప్రభుజీ హాజరై, సమాజ పరిమార్ధానికి ఆధ్యాత్మికత ఎంతో అవసరమని భక్తులకు బోధించారు.?? ప్రత్యేక ప్రకటన: 18 అధ్యాయాలు %-% 18 సెషన్లు!ఈ గీతా ప్రవచన కార్యక్రమంలో ఇస్కాన్ సదాశివపేట ఒక ముఖ్యమైన ప్రకటన చేసింది. భక్తి వేదాంత యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో "18 అధ్యాయాలు %-% 18 సెషన్లు" పూర్తి గీతా కోర్సు మార్చి 29, 2025 నుండి ప్రారంభమవుతుంది.ఈ కోర్సులో భాగంగా:భగవద్గీతలోని 18 అధ్యాయాల పూర్తి వివరణఆచార్యుల ద్వారా స్పష్టమైన దివ్య బోధనలు జీవిత మార్గదర్శకత, ధార్మిక దృక్పథంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు:ఈ మహోన్నత కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కింది నిర్వాహకులు కీలక పాత్ర పోషించారు: ప్రధాన నిర్వాహకుడు: ప్రవీణ్ వేణుగోపాల్ మెట్టు రామకృష్ణ అభిరామ్, శివ రామ్ కృష్ణ, రాఘవేంద్ర యాదవ్పట్లోల్ల కృష్ణ, శ్రవణ్వీరి నిబద్ధత, కృషి వల్లే ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భక్తులు సత్సంగం, కీర్తన, ప్రవచనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. సదాశివపేటలో ఇస్కాన్ నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల ప్రభావం వృద్ధి చెందుతున్నదనికి ఈ భారీ హాజరు ఒక నిదర్శనం.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్నీ శాఖల భక్తులకు, స్వచ్ఛంద సేవకులకు, ప్రధాన నిర్వాహకులకు ఇస్కాన్ సదాశివపేట టీమ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

# అమీన్పూర్, బొల్లారం పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ..

● అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి..

● ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ క్రైమ్స్ నివారణనకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.. ● ఈసీ మనీ అనేది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని గుర్తించాలి.. జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్, బొల్లారం పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. గారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను, స్టేషన్ రికార్డ్లను తనిఖీ చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని యస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. జిల్లాలో పటాన్ చెర్వు సబ్-డివిజన్ ప్రాంతాలలో అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ నివారణ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ.. సైబర్ మోసగాళ్ళ పన్నిన వలలో పడుతున్నారని, ఈసీ మనీ అనేది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని గుర్తించాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉద్యోగుల తాకిడి, స్కూల్స్, కళాశాలల బస్సుల వలన అధిక ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగి వాహనదారులు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారని, దీనిని అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడం, సంబంధిత అధికారులతో మాట్లాడి బోలార్డ్స్ వేయించడం వేయించాలని అన్నారు. ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యస్.హెచ్.ఓ కు పలు సూచనలు చేశారు.



# ఘనంగా ఇఫ్తార్ విందు మాజీ కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్ ఆధ్వర్యంలో ...





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ఆదివారం నాడు సదాశివపేటలోని పిట్టలకేరిలో 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది, మన్ బీన్ వ్యవస్థాపకులు ఎం ఏ ముఖీమ్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఏ ముఖీం, ఇలియాజ్ షరీఫ్ వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లింలకు అతిముఖ్యమైందని, రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు సోదరీమణులు ఉపవాస దీక్షలు చేపట్టి వారి యొక్క అల్లాకు భక్తిశ్రద్ధలతో ప్రార్థించడం జరుగుతుందన్నారు.

# బదిలీ సహజమే- పనితీరుతోనే గౌరవం



**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** ఉద్యోగి ఎక్కడ పని చేసిన తాను సమర్థవంతంగా చేసిన పనే వారి గౌరవాన్ని పెంచుతుందని అలాంటి కోవకు చెందిన వారే నాళం శ్రీదేవి, సువర్ణ అని పెదపూడి మండల ఎంపీడీవో కొవ్వూరి నరేంద్ర రెడ్డి, ఈఓపిఆర్డి మల్లిడి సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం పెదపూడి మండలం ఎన్ఆర్ఈజీఎస్ ఆఫీస్ టెక్నికల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న నాళం శ్రీదేవి, సువర్ణ కాకినాడ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎంపీడీవో కొవ్వూరి నరేంద్ర రెడ్డి, ఈఓఆర్డి ఎమ్ఎస్ఎన్ రెడ్డి,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ సత్యనారాయణ, మండల ఇంజనీరింగ్ ఇన్చార్జ్ ఆఫీసర్ శ్రీనివాస్ నాళం శ్రీదేవి ప్రదీప్ దంపతులను ఘనంగా సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. ఆఫీస్ సమయ వేళలు సక్రమంగా పాటిస్తూ ఉద్యోగ ధర్మాన్ని శ్రీదేవి,సువర్ణ చక్కగా నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత...

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి నియోజక వర్గం కూకట్పల్లి డివిజన్ లో నివాసం ఉంటున్న కోడిరెక్కల రామారావు కిడ్నీ సమస్యతో నిమ్స్ హాస్పిటల్ లో చేరడం జరిగింది. ఆయన భార్య రత్నకుమారి కూకట్పల్లి లోని జి.వి.ఆర్ కార్యాలయం లో సంప్రదించగా వారికి కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి అప్లై చేయడం జరిగింది.ఈ సందర్భంగా రెండు లక్షల 50 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయ్యింది. పిట్టిలెటర్ ను కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు చేతుల మీదుగా రామారావు భార్య రత్నకుమారికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, శివ చౌదరి,బొట్టు రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నకుమారి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం, 25 మార్చి 2025
GENERAL NEWS

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, సన్నాహక సమావేశ కార్యక్రమం

**కూకట్ పల్లి:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కూకట్ పల్లి నియోజకవర్గం లో బాలనగర్ సామ్రాట్ హెూటల్, లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధన్ జిల్లా సన్నాహక సమావేశ కార్యక్రమం జరిగింది... పిసిసి కోఆర్డినేటర్ ఇంచార్జ్ లు గా చౌహన్ శివ, కృష్ణ పని, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అయ్యి సమావేశంలో పాల్గొన్న సభ్యులందరికీ ఈ విధంగా ప్రతిజ్ఞ చేయించారు,, భారతీయులైన మేము మా రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తాము.మాకు సార్వభౌమత్వ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటనను, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని కల్పించడానికి కుల, మత, ప్రాంత, వర్ణ, లింగ, ధనిక, పేద లాంటి ఏ రకమైన బేదాలు లేకుండా అందరికి సమాన హక్కులు, బాధ్యతలు రాజ్యాంగం కల్పించింది.ఇటీవల పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతి నెలకొల్పుతున్నాయి. విభేదాలు సృష్టిస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి..ఇలాంటి తరుణంలో శాంతి అహింసలను మూల సూత్రాలుగా మనకు బోధించిన మహాత్ముడి స్ఫూర్తిగా, మనుషులంతా ఒక్కటే అంటూ రాజ్యాంగంలో అందరికి సమాన హక్కులు కల్పించిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను



అమలు చేస్తూ మన గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్త శుద్ధితో, అంకిత భావంతో అహర్నిశలు కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాను...భారతీయులైన మేము మా రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తాము.మాకు సార్వభౌమత్వ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటనను, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని కల్పించడానికి కుల, మత, ప్రాంత, వర్ణ, లింగ, ధనిక, పేద లాంటి ఏ రకమైన బేదాలు లేకుండా అందరికి సమాన హక్కులు, బాధ్యతలు రాజ్యాంగం కల్పించింది.ఇటీవల పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతి నెలకొల్పుతున్నాయి. విభేదాలు సృష్టిస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి.ఇలాంటి



తరుణంలో శాంతి అహింసలను మూల సూత్రాలుగా మనకు బోధించిన మహాత్ముడి స్ఫూర్తిగా, మనుషులంతా ఒక్కటే అంటూ రాజ్యాంగంలో అందరికి సమాన హక్కులు కల్పించిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ మన గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్త శుద్ధితో, అంకిత భావంతో అహర్నిశలు కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాను... అని సభ్యులందరూ ప్రతిజ్ఞ చేశారు జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లు కోలన్ హనుమంత్ రెడ్డి, బండి రమేష్, వజ్రష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సత్యం శ్రీరంగం, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి మరియు ఎస్టీ సెల్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ, నాయకులు, ఐ ఎన్ టి యు సి, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు..

## శ్రీ శ్రీ శ్రీ పలుగుమిది నల్లపోచమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**సంగారెడ్డి జిల్లా:** హత్నూర మండలం, శేర్ ఖాన్ పల్లి పల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ పలుగుమిది నల్లపోచమ్మ దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు పాల్గొన్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి, భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కాట సుధా గారిని ఘనంగా సన్మానించారు.

## గుమ్మడిదల మల్లన్న స్వామి కళ్యాణంలో సి జి ఆర్







**గుమ్మడిదల:** మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ మల్లన్న దేవాలయంలో జాతర మహెూత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.యాదవ సంఘం ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్న ప్రసాదం కార్యక్రమంలో భక్తులు పాల్గొని భోజనం స్వీకరించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్దలు గోవర్ధన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు.





ఈరోజు గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లిలో జరిగిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల కళ్యాణ మహెూత్సవ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనడం జరిగింది

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి): అనపర్తి తహసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ను సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), షేక్ దరియా,సత్తి దేవదాన రెడ్డి, మామిడిశెట్టి శ్రీను, వైట్ల బాబూరావు,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా భగత్ సింగ్ 94వ వర్ధంతి

- ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కన్వీనర్ పల్లి సురేష్ అధ్యక్షతన
- రఘుదేవపురం లో జరిగిన కార్యక్రమం
- కొవ్వొత్తులతో ఘన నివాళి

**రాజమండ్రి, మార్చి-23:** భరతదేశ విముక్తి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 94 వర్ధంతి ని పురస్కరించుకుని రాజు గురు, సుఖదేవ్ ల సంస్మరణ కార్యక్రమాన్ని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఘనంగా నిర్వహించారు. 2025, మార్చి-23 న రాజమండ్రి, సీతానగరం, రఘుదేవపురంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ హరిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ-(విముక్తి)) రెండు తెలుగు రాష్ట్రాల నాయకురాలు పి.సునీత, ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి మరియు పివైఎల్ గద్దె విజయ్ పాల్గొని ప్రసంగించారు. నూనూగు మీసాల లేత వయస్సులో దేశం కోసం తమను తాము ఆత్మ బలిదానం చేసుకున్న విప్లవ వీర కిషోరుల త్యాగాలను నేటి విద్యార్థి, యువకులు అలవర్చుకొని, మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి, దేశ ప్రజాల విముక్తితో పాటు విదేశీ బానిస సంకెళ్ళను తెటంచడానికి గదర్ పార్టీని ఏర్పాటు చేసి, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. దేశ సంపూర్ణ విముక్తి కోసం పోరాడుతున్న క్రమంలో పార్లమెంట్ సమావేశాల్లో కుట్ర జరుగుతుందని తెలుసుకొనన్న భగత్ సింగ్, బటు కేశవదత్తుతో కలిసి ప్రాణహాని తలపెట్టని పొగబాంబును విసిరి బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన గొప్ప పోరాట యోదులని కొనియాడారు. యావత్తు దేశ ప్రజానీకానికి తెలియచెప్పేందుకే ఇలాంటి సాహసోపేతమైన చర్యకు పాల్పపడ్డారని అన్నారు. విప్లవ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లపై తెల్లదొరలు తమ కుట్రలతో తప్పుడు కేసులకు గురిచేసి, ఉరిశిక్ష లతో వారి ప్రాణాలను తీశారని గుర్తుచేశారు. ఒక తెల్లోడువెళ్ళిపోయి, మరో నల్లవాడు అధికారం చేపట్టినప్పటికి ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదని గొంతెత్తి నినదించారని అన్నారు. జెండాలు మారాయి, టోపీలు మారాయి కులం, మతం, ప్రాంతీయ తత్వాలతో దేశ ప్రజలలో విష సంస్కృతిని పెంచి, రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. భగత్ సింగ్ 94 వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అమరులు షహీద్ భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవులు చూపిన దారిలో పౌర ప్రజాస్వామిక హక్కులకోసం, ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేయాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పేలా తగిన చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం నేడు సామాజిక బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. బడా భూర్జువా, భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదామని నినదిస్తూ సభ అనంతరం కొవ్వొత్తులతో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లకు ఘన నివాళులు అర్పించారు.



## తెలంగాణలో పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు

- ఇప్పటికైతే గడువు పెంచే యోచన లేదన్న మంత్రి ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన కనిపిస్తోందన్న మంత్రి

**హైదరాబాద్ మార్చి 24:** భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని వెల్లడిఎల్ఆర్ఎస్ పై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతానికి ఎల్ఆర్ఎస్ గడువు పెంచే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. ఆశించిన స్థాయిలో స్పందన లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్లను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు.ఎవరూ ఇబ్బంది పడవద్దనే ఉద్దేశంతో ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. భూముల రిజిస్ట్రేషన్ కు సర్వే మ్యాప్ తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. భూమికి మ్యాప్ లేని వారికి కూడా సర్వే చేయించి నిర్ధారిస్తామని తెలిపారు. భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయని స్పష్టం చేశారు. దాదాపు వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తామని మంత్రి వెల్లడించారు.

## మహిళల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి : ఎమ్మెల్యే నల్లమిల్లి



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా మహిళలను బలోపేతం చేయాలని పురుషులతో పాటు మహిళలు కూడా పొదుపు పాటిస్తే ఆ కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుతాయని తద్వారా రాష్ట్ర,దేశ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో అనపర్తి నియోజకవర్గం నాలుగు మండలాల్లోని 14 మంది దళిత మహిళలకు కాంట్రిబ్యూషన్, ఎస్సీ కార్పొరేషన్,సెర్ప్- ఉన్నతి వడ్డీ లేని రుణం ద్వారా రూ.26 లక్షల చెక్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రణాళికతో హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ ఆందోళన



**గార్ల, మార్చి 24:** ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఛలో హైదరాబాద్ కార్యక్రమం కు వెళ్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు లు చేయడం అప్రజాస్వామికం అని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు.ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాదు లో ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ఆందోళన కు బయలుదేరిన అశ కార్యకర్తల ను ముందస్తు గా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆశ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) అధ్వర్యంలో పట్టణ పురవీధులలో ప్రదర్శన నిర్వహించి, స్దానిక నెహ్రూ సెంటర్ లో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లు గా వైద్య అరోగ్య శాఖ లో విధులు నిర్వహిస్తూ చాలి చాలని వేతనాలతో పని చేస్తున్న ఆశ కార్యకర్తల కు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, నమ్మి,చంద్రమ్మ,పార్వతీ తదితరులు ఉన్నారు

## ఉగాది జాతర నల్లమలలో భక్తజన ప్రవాహం



**నంద్యాల** : భానుడు భగభగ మండుతున్నాడు. దప్పికతో గొంతు ఎండిపోతోంది. రాత్రి లేదు.. పగలు లేదు. అడవిలో కాలినడకతో అష్టకష్టాలతో పని లేదు. కానీ తమ పుట్టినింటి ఆడబిడ్డను దర్శిం చుకోవాలి. ఆమె నుదుటిన మిరియాల బొట్టు దిద్దాలి. గాజులు తొడిగి చీరెసారెలు సమర్పించాలి. అప్పుడు కలిగే దివ్యా నుభూతి వర్ణనాతీతం. ఇదీ శ్రీశైలంపై వేంచేసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో కన్నడ భక్తుల అనుభూతి. ఉగాది పర్వదినం సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈనెల 27నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం దివ్యక్షేత్రానికి తరలి వస్తున్నారు. మరీ ముఖ్యంగా నల్లమల అడవి మార్గంలో కాలినడకన భక్త జనజాతర కనువిందు చేస్తోంది.ఆడపడుచుకు సారె సమర్పణకుఅపర శబరిమలైగా పేరొందిన శ్రీశైలం పుణ్యక్షేత్రంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున .. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా దర్శించుకునేందుకు కన్నడ భక్తులు తండోపతండాలుగా తరలిరావటం విశేషం. వీరందరూ కాలినడక మొక్కుతో శ్రీశైలం చేరుతారు. ఇందుకు ఓ ప్రత్యేకత ఉంది. పురాణ శాస్త్రం ప్రకారం, శ్రీ భ్రమరాంబిక దేవీ కన్నడిగుల ఆడపడుచు. తమ ఇంట్లో అఖండ దీపం వెలిగించి.. పిల్లాజెల్లా.. చిన్నా పెద్ద, ఆడమగ ఇలా ఇంటిల్లిపాది నెలరోజుల పాటు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారు. అడవి మార్గంలో మల్లన్న, భ్రమరాంబికను తలచుకుంటూ ఆలయానికి చేరుతారు. ఇక్కడ శ్రీ భ్రమరాంబికను దర్శించుకుని.. తొలుత మిరియాల బొట్టు పెడతారు. దీంతో భ్రమరాంబికకు అంటిన మరక పోతుందని కన్నడిగుల నమ్మకం. ఇక గాజులు, చీరె సారెలు సమర్పిస్తారు. ఇలా ఆది దంపతుల దర్శనం అనంతరం తిరిగి తమ ఇళ్లకు చేరుతారు. ఇలా తమ పుట్టినింటి ఆడపడుచుకు చీరెసారెలు సమర్పించటం కన్నడిగుల ఆచారం, సంప్రదాయం. ఈ ప్రత్యేక పూజలే ఆనవాయితీగా భావిస్తారు. ఇక ఇంట్లో అఖండ దీపం వెలుగుతూనే ఉంటే.. తమ కష్టాలు తీరినట్టేనని సంబరం చేసుకొంటారు.కన్నడిగుల జాతరతమ పుట్టింటి ఆడపడుచు శ్రీ భ్రమరాంబిక దేవీకి తమ ఊరి నుంచి పసుపు కుంకుమ, గాజులు, చీరెసారెలు సమర్పించటానికి కన్నడిగులు బయలుదేరారు.

## హాస్టల్ లో జూనియర్స్ పై సీనియర్స్ దాడి.. ఆందోళనకు దిగిన బంధువులు



**కర్నూలు** : కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని ప్రీ మెట్రిక్ హాస్టల్ లో పదవ తరగతి చదువుతున్న కర్నూలు షరీఫ్ నగర్ కు చెందిన మహేష్ అనే విద్యార్థి తోటి ఏడు, ఎనిమిదో తరగతులు చదువుతున్న విద్యార్థులపై వారం క్రితం విచక్షణా రహితంగా దాడి చేయడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. కింది స్థాయి విద్యార్థులను ఇలా విచక్షణారహితంగా కొట్టడానికి గల కారణాలు ఏవైనప్పటికీ సంబంధిత బాధిత విద్యార్థులపై దాడి అమానుషం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్లో వసతి పొందుతున్న విద్యార్థుల రక్షణ బాధ్యతను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించే విధంగా, ఆయా హాస్టల్లో సంబంధిత అధికారులు రాత్రిపూట నిద్ర చేసే విధంగా జిల్లా కలెక్టర్ తగిన ఆదేశాలు జారీ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.పదవ తరగతి విద్యార్థి మహేష్ ప్రస్తుతం అక్కడే హాస్టల్ లో అడ్మిషన్ లేకుండా పాలకుర్తికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుల సిఫార్సుతో హాస్టల్ లోనే వసతి పొందుతూ తోటి విద్యార్థుల పట్ల అమానవీయంగా ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. సంబంధిత విద్యార్థి మహేష్ వేష భాషలు మిగతా విద్యార్థుల కన్నా భిన్నంగా ఉంటాయని తెలిసింది. అయితే గతవారం 7, 8వ తరగతి చదువుతున్న తోటి విద్యార్థులు తన మాటవినడం లేదని ఆ విద్యార్థులపై విచక్షణ రహితంగా బెల్టుతో, కాలుతో తన్నిన సంఘటన చోటుచేసుకుంది.సంబంధిత హాస్టల్ కు ఇన్చార్జి వార్డెన్ గా వ్యవహరిస్తున్న రాముడికి ఈ విషయం చెబితే మీ గొంతు కోస్తానని మహేష్ బాధిత విద్యార్థులను బెదిరించాడని తెలిసింది. అయితే ఈ విషయం ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ ను సందర్శించినప్పుడు బయటికి తెలిసింది. దీంతో బాధిత బాలుర తల్లిదండ్రులు హాస్టల్ నిర్వాహకులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో విషయం బయటకు తెలిసింది.పైన తెలిపిన వివరాలు పరిగణలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం, రక్షణ కోసం జిల్లా కలెక్టర్ హోదాలో తమరు సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన ఆదేశాలు సంబంధిత అధికారులకు జారీ చేయాలని, అవసరమైతే ఆయా సంబంధిత వార్డెన్లతో సమావేశం నిర్వహించి ప్రక్షాళన చర్యలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పి.ఆనంద్ బాబుతో పాటు పలు విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

## పార్లమెంట్ లో అరకు కాఫీ ఘుమఘుమలు

**అమరావతి** :ఏపీ బ్రాండ్ అరకు కాఫీ ఘుమఘుమలు ఇకపై పార్లమెంట్ లోనూ ఎంపీలకు ఆహ్లాదాన్ని పంచబోతున్నాయి. అరకు లోయలో పండే కాఫీ రుచిని పార్లమెంట్ లో ఎంపీలకు పరిచయం చేసేందుకు అవకాశం ఇవ్వాలన్న ఏపీ ఎంపీల వినతిని లోక్ సభ స్పీకర్ తాజాగా అనుమతించారు. దీంతో పార్లమెంట్ ప్రాంగణంలో ఇవాళ రెండు స్టాల్స్ ను ప్రారంభించారు. కేంద్రమంత్రులు కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్ తో పాటు ఏపీకి చెందిన ఎంపీలు, రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పార్లమెంట్‌లో ఇవాళ రెండు అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో లోక్‌సభ క్యాంటీన్‌లో అరకు స్టాల్ ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. అలాగే రాజ్యసభ క్యాంటీ న్‌లో అరకు కాఫీ స్టాల్ ను వాణిజ్య వ్యవహా రాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. అరకు లోయలో కాఫీ సువాసన పార్లమెంట్ లో గుబాళిం చబోతోందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ట్వీట్ చేశారు.మన గిరిజన సంపద అరకు కాఫీని ప్రచారం చేస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ కాఫీ స్టాళ్లను గర్వంగా ప్రారంభించారని, ఇప్పుడు, మన పార్లమెంటేరియన్లు మన స్థానిక ప్రజల సాధికారత, స్థిరమైన వ్యవసాయాన్ని సూచించే ఈ స్థానిక పానీయం రుచి చూడవచ్చని ఆయన తెలిపారు. ఇది బ్రాండ్ భారత్‌కు పెద్ద ప్రోత్సాహం అన్నారు. అలాగే సీఎం చంద్రబాబు కూడా పార్లమెంట్లో అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభాన్ని స్వాగతిస్తూ ట్వీట్ చేశారు.పార్లమెంట్‌లో కాఫీ ప్రియులకు శుభవార్త! మీరు ఇప్పుడు ఆవరణలోనే తాజాగా తయారుచేసిన అరకు కాఫీ కప్పును ఆస్వాదించవచ్చని చంద్రబాబు తెలిపారు. 'మన్ కీ బాత్'లో అరకు కాఫీని ప్రోత్సహించినందుకు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ఈ స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి దయతో అనుమతి ఇచ్చినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు, తెలిపారు.

# ఉద్యోగులకు పండుగలాంటి అప్డేట్ ఖాతాల్లో చెక్ చేసుకోండి

**అమరావతి** :ఏపీ ఉద్యోగులకు ఉగాది ముందే పండుగ లాంటి వార్త. ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల చెల్లింపు ప్రక్రియ మొదలు పెట్టింది. తాజాగా ఉద్యోగులకు రూ 6,200 కోట్లు బకాయిలు విడుదల చేసేలా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నేడు వారి ఖాతాల్లో నిధుల జమ మొదలు అయింది. వరుస క్రమంలో ఒకటి, రెండు రోజుల్లోనే నిర్ణయించిన బకాయిలు ఉద్యోగుల ఖాతాల్లో జమ ప్రక్రియ పూర్తి చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.బకాయిల విడుదలఏపీ ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల చెల్లింపు ప్రక్రియ మొదలైంది. ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల చెల్లింపు చేస్తున్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సి ఉన్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ బకాయిలను చెల్లింపు కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ. 6 వేల 200 కోట్లు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు జమ విషయాన్ని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు ధృవీకరించారు.తాజాగా ఉద్యోగ సంఘాల



నేతల అభ్యర్ధన మేరకు సీఎం చంద్రబాబు బకాయిల చెల్లింపు పైన నిర్ణయం తీసుకున్నారు. దీంతో, ఇప్పుడు ఉద్యోగుల సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఏఐ కింద ఆర్థిక శాఖ రూ.6,200 కోట్లు విడుదల చేసింది. కాగా జనవరిలోనూ రూ.1,033 కోట్ల బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయటం.. తమ ఖాతాల్లో జమ కావటం పైన ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల కు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇదే సమయంలో పెండింగ్ డీఏల గురించి చర్చ జరుగుతోంది. కాగా, కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం తరువాత డీఏల విషయం పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.ఖాతాల్లో జమఇక, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు పైన ఉద్యోగ సంఘాల నేతలు ప్రస్తావన చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత సమయం తీసుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవు తోంది. ముందుగా గత ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు ఉన్న బకాయిల చెల్లింపు పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. అందులో భాగంగా తొలి విడతలో రూ 1,033 కోట్లు, రెండో విడతగా రూ 6,200 కోట్లు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో, విడతల వారీగా పెండింగ్ ఉన్న మిగిలిన బకాయిల పైన ప్రభుత్వం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# ఏపీ ప్రజలకు హెచ్చరిక... ఈ రైళ్లకు సికింద్రాబాద్ స్టాప్ ఎత్తివేత




**సికింద్రాబాద్** :దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరిగిపోతుండటంతో రూ.450 కోట్లతో ప్రత్యామ్నాయ టెర్మినల్ గా చర్లపల్లి రైల్వేస్టేషన్ ను తీర్చిదిద్దారు. నగరంలో హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడతోపాటు లింగంపల్లి స్టేషన్ కూడా ఉంది. ఇవి కాకుండా చర్లపల్లిని అభివృద్ధి చేసి 9 ప్లాట్ ఫామ్స్ తో దాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగానే హైదరాబాద్ నుంచి, సికింద్రాబాద్ నుంచి బయలుదేరే రైళ్లను, సికింద్రాబాద్ మీదుగా నడిచే రైళ్లను చర్లపల్లి మీదుగా దారి మళ్లించారు. కొన్నింటిని అక్కడి నుంచి నడిపిస్తున్నారు.తాజగా ఏపీలోని విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే కొన్ని రైళ్లకు సికింద్రాబాద్ స్టాప్ ఎత్తేశారు. రద్దీని నియంత్రించేందుకు నాలుగు రైళ్లను సికింద్రాబాద్ స్టేషన్ జాబితా నుంచి తప్పించారు.లోకమాన్య తిలక్ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు ఏప్రిల్ 22 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.విశాఖపట్నం నుంచి లోకమాన్య తిలక్ వెళ్లే రైలు ఏప్రిల్ 24 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.సంబల్‌పూర్-నాందేడ్ సూపర్ ఫాస్ట్ రైలు ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.నాందేడ్-సంబల్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలు ఏప్రిల్ 26 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఇవి వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తాయి.విశాఖపట్నం-నాందేడ్ రైలు ఏప్రిల్ 26 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

నాందేడ్-విశాఖపట్నం రైలు ఏప్రిల్ 27 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ సూపర్ ఫాస్ట్ ఏప్రిల్ 24 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

ఇప్పటికే విశాఖ-లింగంపల్లి జన్మభూమిని చర్లపల్లికి మార్చారు. ప్రతిరోజు సికింద్రాబాద్,

హైదరాబాద్ నుంచి 12 రైళ్లు విశాఖపట్నంకు ప్రయాణిస్తాయి. అయినా ప్రయాణికుల నుంచి ఇంకా డిమాండ్ ఉంటూనే ఉంది. రెండు వందేభారత్ రైళ్లు నడుస్తున్నా 150 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. చర్లపల్లిమీదుగా మార్చిన రైళ్లకు బదులుగా సికింద్రాబాద్ నుంచి వేరే రైళ్లను ప్రకటించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# విడదల రజనీకి ఎంపీ లావు దిమ్మదిరిగే కౌంటర్ నువ్వు మొదలుపెట్టింది నేను

**అమరావతి** :ఏపీలో పల్నాడు రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. వైసీపీ మాజీ మంత్రి విడదల రజనీపై తాజాగా ఏసీబీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఆమె కూటమి ప్రభుత్వాన్ని, అందులోనూ టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల్ని టార్గెట్ చేస్తూ నిన్న చేసిన ఫోన్ ట్యాపింగ్ విమర్శలు సంచలనంగా మారాయి. దీంతో విడదల రజనీకి లావు ఇవాళ ఘాటు కౌంటర్ ఇచ్చారు. మీరే మొదలుపెట్టారు.. ఇప్పుడు మేము ముందుకి తీసుకెళ్తామంటూ ఆమెకు వార్నింగ్ ఇచ్చారు.విడదల రజినీ వేధింపులు ఎదుర్కొన్న స్టోన్ క్రషర్స్ సంస్థ కేసు పెడితే తనపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారంటూ టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నించారు. ఏసీబీ నమోదు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు ఇతర అధికారుల వాంగ్మూలాలు ఉన్నాయని గుర్తుచేశారు. అలాగే తానేదో కాల్ డేటా తీసుకున్నానని ఆరోపించారని, తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారని, మా వాళ్ళకు ఒక న్యాయం, బయటి వారికి ఒక న్యాయం ఉండదని లావు గుర్తుచేశారు.


ఫోన్ డేటా, భూములపై విడదల రజనీ చేసిన ఆరోపణలపై



స్పందిస్తూ , 40 ఏళ్లుగా విజ్ఞాన్ విద్యాసంస్థలు నడుపుతున్నామని, ఏపీలో ఏ ఒక్క ప్రాంతంలో తమకు భూమి కావాలని ప్రభుత్వాన్ని అడగలేదన్నారు. అమరావతిలో అనేక విద్యాసంస్థలు భూమికోసం దరఖాస్తు చేసుకున్నాయని, అయినా తాము మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తు చేయలేదన్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వేలం వేస్తే మిగతా వారితో పాటు పాల్గొని ఎక్కువ రేటు చెల్లించి మరీ భూమి తీసుకున్నట్లు తెలిపారు. వేలానికి, కేటాయింపుకు మధ్య చాలా తేడా ఉందని రజనీకి గుర్తుచేశారు. ఇదంతా రజినీతో ఎవరు మాట్లాడించారో తనకు బాగా తెలుసన్నారు.

ఒకరిని విమర్శించే ముందు వివరాలు తెలుసుకోవాలని నిజాలు తెలుసుకోకుండా మాట్లాడితే నవ్వులపాలవుతారంటూ విడదల రజనీకి లావు కృష్ణదేవరాయుల సూచించారు. విడదల రజిని మాదిరిగా తాను అబద్ధాలు చెప్పలేనన్నారు. ఐపీఎస్ జాషువా సర్వీసు 2040 వరకు ఉందని, జాషువా స్టేట్‌మెంట్‌లో లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్స్‌కు, తనకు ఎలాంటి బంధుత్వం లేదని చెప్పాలని లావు తెలిపారు. బాలినేని శ్రీనివాస్ రెడ్డి దగ్గరకు సాక్షి రిపోర్టర్ మాధవరెడ్డిని రజనీయే తీసుకువెళ్లారని ఐపీఎస్ జాషువాను బెదిరించి ఒత్తిడి తీసుకొచ్చారని.. దీంతో జాషువా ఈ అంశాన్ని మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు భారీగా ఫైన్ వేశారని గుర్తుచేశారు. రజనీ రెడ్ బుక్ రాజ్యాంగం విమర్శల్ని లావు కొట్టిపారేశారు.

# విజయవాడలో హోటల్స్ రెస్టారెంట్స్ కు సర్కార్ శుభవార్త



**విజయవాడ**:ఏపీలో రాజధాని అమరావతి పరిధిలోకి వచ్చే విజయవాడ నగరంలో అర్ధరాత్రి ఫుడ్ లవర్స్ కు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో బస్సులు, రైళ్లలో నగరానికి చేరుకుని తిండి కోసం అల్లాడు తున్న ప్రయాణికులకు ఊరటని చ్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్ల యజమానుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల్ని సర్కార్ అంగీకరించింది.

విజయవాడలో గతంలో అర్ధరాత్రి కూడా పనిచేసేలా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. కానీ వాటి వల్ల ఎదురవుతున్న సమస్యలతో వీటి ప్రభావం తగ్గిపోయింది. అదే సమయంలో విజయవాడ నగరంలో ఫుడ్ కోర్టులకు వెళ్లాలంటే ఆటోలు, ఇతర వాహనాలు దొరకని పరిస్థితి. దీంతో అర్ధరాత్రి నగరానికి వచ్చే వారు ఇబ్బందులు పడే వారు. ఈ నేపథ్యంలోనే తమకు అర్ధరాత్రి 12 గంటల వరకూ హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని వాటి యజమానులు కోరుతున్నారు.దీనికి ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. అర్ధరాత్రి 12 గంటల వరకూ విజయవాడ నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుకునేందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఎక్కడైనా అర్ధరాత్రి కూడా హోటళ్లు, రెస్టారెంట్లు తెరిచి ఉంచబోతున్నారు.

తెలంగాణ తెలుగు-వెలుగు తెలుగు జాతీయ దినపత్రిక ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం, 25 మార్చి 2025



# పంజాబ్ మతబోధకుడి గురించి తెలిస్తే నోట మాట రాదంతే

**పంజాబ్ :**ఒక వైరల్ చూసిన తర్వాత.. గుడ్డిగా నమ్మినోళ్ల విషయంలో ఒక మతబోధకుడి తీరుకు ఒళ్లు మండటంతో పాటు.. ఇలాంటివారిపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న భావన వ్యక్తమవుతోంది. పంజాబ్ లోని జలంధర్ కు చెందిన ఒక మతబోధకుడి చేష్టలు షాకింగ్ గా మారాయి. అతడిపై లైంగిక ఆరోపణలతో పాటు.. మోసం చేశారన్న ఫిర్యాదును పోలీసులు అందుకున్నారు. తన ఆఫీసుకు వచ్చిన వారిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేయటం.. వారిపై వస్తువుల్ని విసిరేయటంతో పాటు.. చేయి చేసుకునే వైనం చూస్తే.. వీడు అసలు మత బోధకుడేనా? అన్న సందేహం కలుగకమానదు. ఇంతకూ ఇతగాడి పేరేమిటో చెప్పలేదు కదా? అతడి పేరు బాజిందర్ సింగ్.ఒక జాట్ కుటుంబంలో పుట్టిన ఈ పంజాబ్ వ్యక్తి.. పదేళ్ల క్రితమే మగబోధకుడిగా మారాడు. జలంధర్.. మొహాలిలలో ప్రార్థనా మందిరాల్ని ఏర్పాటు చేసిన ఇతగాడికి స్వల్ప వ్యవధిలో సోషల్ మీడియాలో లక్షలాది పాలోవర్లు ఉన్నారు. అయితే.. ఇతడి పాపులార్టీకి తగ్గట్లే బోలెడన్ని నేరారోపణలు ఇతడిపై తరచూ వస్తుంటాయి. తనను ఈ మతబోధకుడు వేధింపులకు గురి చేసినట్లుగా కపుర్తలాకు చెందిన 22 ఏళ్ల మహిళ పోలీసులకు కంప్లైంట్ చేశారు.2017 నుంచి 2022 వరకు అతడి ప్రార్థనా మందిరాలకు తాను వెళ్లేదానినని.. తన తల్లిదండ్రులతో వెళ్లిన సమయంలో తన మొబైల్ నెంబరును తీసుకున్నాడని చెప్పారు. అప్పటి నుంచి తనకు ఫోన్లు చేసి ఇబ్బంది పెట్టేవాడని.. ఆదివారాల్లో తన క్యాబిన్ కు పిలిపించుకొని ఒంటరిగా కూర్చోబెట్టేవాడని.. ఆ టైంలో చాలా అసభ్యకరంగా ప్రవర్తించేవాడని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.లైంగిక వేధింపులతో పాటు.. డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తన కుమార్తె ఆరోగ్యాన్ని బాగు చేస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసినట్లుగా మరో కేసు కూడా ఇతడిపై



ఉంది. తాజాగా తన ఆఫీసులో తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించటం.. టేబుల్ మీద ఉన్న బ్యాగుల్ని సందర్శకుల పైకి విసిరేయటం.. చెంప మీద కొట్టటంతో పాటు.. మహిళా భక్తురాలిపై కూడా చేయి చేసుకోవటం.. వాటికి సంబంధించిన వీడియో వైరల్ కావటంతో.. ఈ మతబోధకుడి వ్యవహారం మరోసారి చర్చకు వచ్చిందని చెప్పాలి.

# జనసేన ఎమ్మెల్యేల బాధ అదేనా



**విజయవాడ :**జనసేనకు చెందిన ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారు అన్న వార్తలు ఏపీ రాజకీయాల్లో కలవరం రేపుతున్నాయి. ఇంతకీ వారు ఈ విధంగా ఎందుకు సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నారు. ఈ మీటింగ్ అజెండా ఏమిటి వారి సమస్యలు ఏమిటి అసలు వారికి కావాల్సింది ఏమిటి అన్న చర్చ అయితే సాగుతోంది.ఇదిలా ఉంటే ఏపీ శాసనసభ సమావేశాలు ముగిసీ ముగియడంతోనే జనసేన ఎమ్మెల్యేలు అంతా కలసి విజయవాడలో ఈ మీటింగ్ పెట్టుకున్నారని అంటున్నారు. ఈ సమావేశంలో జనసేన నంబర్ టూ నాయకుడు మంత్రి అయిన నాదెండ్ల మనోహర్ కూడా హాజరయ్యారని తెలుస్తోంది.ఆయనకే ఈ విషయాలు అన్నీ జనసేన ఎమ్మెల్యేలు చెప్పుకున్నారని అంటున్నారు. తన నియోజకవర్గాలలో తగిన గౌరవం లేదని తమ మాట ఏ మాత్రం చెల్లుబాటు కావడం లేదని ఎమ్మెల్యేలుగా తాము ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోతున్నామని జనసేన ఎమ్మెల్యేలు వాపోయినట్లుగా చెబుతున్నారు.తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలలో టీడీపీ ఇంచార్జిలు ఉన్నారని వారిదే హవాగా సాగుతోందని అధికారుల వద్ద వారి మాటే చెల్లుతోందని కూడా చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశారని అంటున్నారు. జనసేన బలంగా ఉన్న చోట టీడీపీ ఎమ్మెల్యేలుగా నెగ్గిన వారు అక్కడ తమదే అంతా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, కానీ జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోట మాత్రం టీడీపీ ఇంచార్జిలదే పెత్తనం అంటే ఇదెక్కడి న్యాయం అని అంటున్నారు.నిజంగా ఈ విధంగా జరుగుతోందా అంటే జనసేనలో ఉన్న సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలుగా నెగ్గి కూడా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ఉత్తరాంధ్రాలో చూస్తే అలాగే ఉంది. ఒక మాజీ మంత్రి జనసేన టికెట్ మీద ఎమ్మెల్యే అయ్యారు. కానీ అక్కడ అంతా టీడీపీ ఇంచార్జిదే పెత్తనంగా సాగుతోంది అని అంటున్నారు.ఇంకో వైపు చూస్తే మాజీ మంత్రిగా పనిచేసిన ఒక టీడీపీ నేత నియోజకవర్గం మారారు కానీ తన సొంత సీటులో జనసేన ఎమ్మెల్యే గెలిచినా తనదే చెల్లుబాటు కావాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఇక గోదావరి జిల్లాలలోనూ ఇదే రకమైన వాతావరణం ఉందిట.దాంతో వారంతా ఈ విషయం మీద అధినాయకత్వం జోక్యం చేసుకుని సరి దిద్దకపోతే తాము ఇబ్బందులో పడతామని అంటున్నారుట. ఇదిలా ఉంటే ఈ సీక్రెట్ మీటింగ్ జరిగింది అన్న ప్రచారం ఉంది కానీ దాని మీద బయటపడి మాట్లాడేందుకు మాత్రం ఎమ్మెల్యేలు నిరాకరిస్తున్నారు. ఇక జనసేన అధినాయకత్వానికి ఈ విషయాలు అన్నీ తెలియచేసి ఒక మంచి పరిష్కారం కోసం వారు కోరుకుంటున్నారుట.

# నాకేం తెలియదు.. చావే శరణ్యం అంటున్న డిబార్ అయిన టెన్త్ స్టూడెంట్

**నల్గొండ జిల్లా :**నల్గొండ జిల్లా నకిరేకల్ లో పదవ తరగతి పరీక్ష పత్రం లీక్ అయిన వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షాకేంద్రంలో ప్రశ్నాపత్రం లీక్ అయ్యింది. గోడ దూకి పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించిన కొంతమంది వ్యక్తులు ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీసుకుని వెళ్లారు. ఆపై జవాబులను జిరాక్స్ తీయించి పరీక్ష రాస్తున్న కొందరు విద్యార్థులకు అందించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు వారిని పట్టుకున్నారు.ఈ వ్యవహారంలో విద్యార్థినిని డిబార్ చేయగా.. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంటల్ ఆఫీసరును విధుల నుంచి తప్పించారు. అయితే పేపర్ లీక్ ఘటనలో తనకు ఏ పాపం తెలియదని విద్యార్థిని బల్లెం ఝాన్సీలక్ష్మీ వాపోతుంది. ఎగ్జామ్ సెంటర్ లో కిటికీ పక్కన కూర్చుని పరీక్ష రాస్తుండగా.. ఇద్దరు యువకులు తనను బెదిరించి ఫోటో తీసుకున్నారని చెబుతోంది. ప్రశ్నాపత్రం




చూపించకపోతే రాయితో కొడతామని బెదిరించారని వెల్లడించింది. అందుకే ఆ సమయంలో భయం వేసి, ఏం చేయాలో అర్థం కాక క్వశ్చన్ పేపర్ చూపించానని చెప్పింది. పేపర్ ను ఫొటో తీసుకుని యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారని వివరించింది. పక్కన ఉన్నవారు కూడా ఏం కాదులే చూపించు అన్నారని.. ఇందులో తన ప్రమేయం ఏమిలేదని కన్నీటి పర్యంతం అవుతోంది. దయచేసి తనను పరీక్ష రాసేందుకు అనుమతించాలని.. ఎవరో చేసిన దానికి తనను బలి చేయొద్దంటూ వేడుకుంటుంది. దయచేసి మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరుతుంది. పరీక్షల్లో చూసి రాయాల్సిన అవసరం 5 తనకు లేదని విద్యార్థిని ఝాన్సీ లక్ష్మి స్పష్టం చేసింది.ఎగ్జామ్ రాయనియ్యకపోతే తనకు చావే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

తమ కూతు రుని పరీక్ష రాయనివ్వాలని విద్యార్థిని తల్లిదండ్రులు సైతం కోరు తున్నారు. కూలీ పనులు చేసుకుంటూ బిడ్డను చదివి స్తున్నావ ఎని.. తన భవిష్యత్తును అంధకారం చేయొద్దని వేడుక ుంటు న్నారు. ఇక ఈ ఘటనలో పోలీసులు 11 మందిపై కేసు నమో దు చేయగా.. ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సమాచారం.

# హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం

**హైదరాబాద్ :**హైదరాబాద్ పరిధిలో మరో దారుణం చేసుకుంది. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచార యత్నం కలకలంగా మారింది. సికింద్రాబాద్-మేడ్చల్ వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో ఈ ఘటన చోటు చేసుకుంది. తప్పించుకునే క్రమంలో రైలు నుంచి బయటకు దూకిన యువతికి తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే 108కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది క్షతగాత్రురాలిని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన వెలుగులోకి వచ్చింది. రైలు బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ యువకుడు అత్యాచారానికి యత్నించడంతో తప్పిం చుకునే క్రమంలో రైలు నుంచి బయటకు దూకిన యువతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మేడ్చల్?లోని ఓ వసతి గృహంలో ఉంటూ



ప్రైవేట్?గా పని చేస్తున్న ఓ యువతి (23) ఈ నెల 22వ తేదీ సాయంత్రం మేడ్చల్ రైల్వేస్టేషన్?కు వెళ్లి అక్కడి నుంచి ఎంఎంటీఎస్ ట్రైన్?లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్?కు చేరుకుంది.ఆ యువతి తన సెల్?ఫోన్ రిపేరింగ్ చేయించుకుని తిరిగి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్?కు వచ్చింది. ఎంఎంటీఎస్?లో మేడ్చల్ కు మహిళల కోచ్?లో బయలుదేరింది. అప్పటికే ఆ బోగీలో ప్రయాణిస్తు న్న ఇద్దరు మహిళలు మార్గమధ్యంలోని అల్వాల్ రైల్వే స్టేషన్?లో దిగిపోయారు. అనంతరం ఆ కోచ్?లో ఆమె ఒక్కరే మిగిలిపోయారు. ఇది గమనించిన ఓ యువకుడు (25) ఆమె వద్దకు వచ్చి అత్యాచా రయత్నానికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో యువతి నడుస్తున్న రైలు నుంచి బయటకు దూకేసింది.కొంపల్లి సమీప ప్రాంతంలోని రైలు బ్రిడ్జి వద్ద రైలు నుంచి కింద పడి, గాయపడి ఉన్న ఆమెను గుర్తించిన స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వటం తో ప్రథమ చికిత్స అందించి ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి వద్ద నుంచి స్టేట్?మెంట్?రికార్డు చేసిన పోలీసులు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హైడ్రా పేరుతో దందా చేస్తే జైలుకే హైడ్రా చీఫ్ రంగనాథ్ వార్నింగ్



**హైదరాబాద్:** హైడ్రా పేరుతో ఇక సెటిల్‌మెంట్లు చేస్తే ఊరుకునేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. వంశీరామ్ బిల్డర్స్‌పై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ విషయంపై చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. నేడు ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఒక్క వంశీరామ్ బిల్డర్స్ మాత్రమే గాకుండా, రాజ్‌పుష్ప వంటి బిల్డర్స్‌కు కూడా బఫర్ జోన్లలో డంపింగ్ చేశారని రంగనాథ్ తెలిపారు. వారందరికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. హై డ్రా పేరుతో సెటిల్ మెంట్లు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే చాలా కేసులు నమోదయ్యాయని అలాంటి అధికారులు ఉంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు.

## బోధన సిబ్బందికి బకాయిలు విడుదల చేయండి కేంద్ర ఆర్థిక మంత్రికి ఈటల వినతి



**న్యూఢిల్లీ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన సిబ్బందికి కేంద్రం నుంచి రావలసిన ఏడవ వేతన సవరణ సంఘం అరియర్స్ ను విడుదల చేయించవలసిందిగా కోరుతూ బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ నాయకత్వంలో పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.వ్యవసాయ వర్సిటీ బోధన సిబ్బంది ఏడవ వేతన సవరణ సంఘం అరియర్స్ విషయంలో సహకరించమని కోరుతూ, వారికి కేంద్రం నుంచి రావలసిన 17.5 కోట్ల రూపాయలను సెంట్రల్ గ్రాంట్ గా రిలీజ్ చేయాలని విన్నవించారు.

ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం వినతి పత్రాన్ని కూడా జతచేస్తూ నిర్మలా సీతారామన్ కు అందజేశారు. ఆర్థిక మంత్రిని కలసిన బృందంలో ఈటెల తో పాటు ఇతర పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నగేష్ లు ఉన్నారు.యూనివర్సిటీ బోధన సిబ్బంది కి, సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఈ పీ ఆర్ సి ఆరియర్స్ సెంట్రల్ గ్రాంట్ విషయంలో చొరవ తీసుకున్నందుకు ఈటల రాజేందర్ బృందానికి వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది.

## శ్రవణ్ కుమార్ కు ముందస్తు బెయిల్



**న్యూఢిల్లీ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడ శ్రవణ్ కుమార్ కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది.. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టు ఆయన వేసిన పిటిషన్ పై నేడు తుది విచారణ జరిగింది.. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం కొన్ని షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.. ఈ కేసులో విచారణకు ఎప్పుడు పిలి చినా పోలీసుల ఎదుట హాజరుకావాలని శ్రవణ్ సూచించింది.. ఈ కేసు గురించి ఎక్కడా మాట్లాడవద్దంటూ ఆదేశాలిచ్చింది.. ఈ కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుంచి శ్రవణ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.. అటు తర్వాత ఆయన అమెరికాకు చేరుకున్నారు.. దీంతో ఇప్పటికే ఆయనపై పోలీసులు రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేశారు.. ఈ నేపథ్యంలోనే ఆయనకు ముందస్తు బెయిల్ సుప్రీం కోర్టు మంజూరు చేసింది.ప్రభాకర్ రావు బెయిల్ పై విచారణ వాయిదా..ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్ విచారణను తెలంగాణ హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది.. నేడు జరిగిన విచారణలో పేర్కొంది.

## దర్శన వేళలు, వసతి పై పాలక మండలి కీలక నిర్ణయాలు

**హైదరాబాద్:** టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. 2025-26వ సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను రూ.5258.68 కోట్లతో పాలకమండలి ఆమోదించింది. ముంతాజ్ హోటల్ నిర్మాణానికి కేటాయించిన భూములను రద్దు చేసారు. మన దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించారు. బ్రేక్ దర్శనాల మార్పు తో పాటుగా భక్తుల వసతి కోసం వసతి సముదాయాల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీలో అన్యమత ఉద్యోగస్తులను పూర్తిగా తెలిగించాలని నిర్ణయించారు.ముంతాజ్ భూముల రద్దుటీటీడీ పాలకవర్గ నిర్ణయాలను ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ముంతాజ్ హోటల్ నిర్మాణానికి వేరేచోట భూమి కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. అలిపిరి వద్ద ఉన్న 35.24 ఎకరాలతో పాటు 15ఎకరాల టూరిజం భూమిని టీటీడీ స్వాధీనం చేసుకొని.. ప్రత్యామ్నాయంగా 50ఎకరాల భూమిని మరో ప్రదేశంలో ప్రభుత్వానికి కేటాయిస్తామని చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. మన దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టుతో పాటు నూతనంగా ఏర్పాటు చేయబోయే మరో ట్రస్టు ద్వారా వచ్చే విరాళాలతో ఈ ఆలయాలను నిర్మిస్తామని చెప్పారు.ప్రత్యేక కమిటీశ్రీవారి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యే కంగా కమిటీని నియమిస్తున్నామని చెప్పా రు. శ్రీవారి ఆస్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. టీటీడీలో అన్యమత ఉద్యోగస్తులను తొలగిస్తామని ప్రక చారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. ఏపీ లో పలు చోట్ల నిలిచిపోయిన దేవాలయాలను పునర్ నిర్మించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పోటు కార్మికులకు జీఎస్టీ భారం లేకుండా జీతం రూ.43 వేలు చెల్లించేలా నిర్ణ తీసుకున్నారు. న్స సిటీకి టీటీడీ కేటాయించిన 20 ఏకరాల స్థలాలను రద్దు చేశామన్నారు. టీటీడీ ఉద్యోగులకు మూడు నెలలకు ఒక్కసారి సుపథం ద్వారా దర్శనం కల్పిస్తామని ప్రకటించారు.బ్రేక్ దర్శనాల టైమింగ్స్‌తిరుమలలో లైసెన్స్ లేని హ్యాకర్ల నిర్మూలనకు రెవెన్యూ, విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ర్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. టీటీడీ ఉద్యోగుల నేమ్ బ్యాడ్జులు ఏర్పాటుపై అధ్యయనం చేశామని తెలిపారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు గతంలో మాదిరిగానే ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని సూచించామని చెప్పారు. తిరుపతి గంగమ్మ, తలకోన, కర్నూల్ జిల్లాలో బుగ్గ, అనకాపల్లిలోని ఉపమాక, ధర్మవరం, తెలంగాణలోని కొడంగల్, సికింద్రాబాద్, నిర్మిస్తున్నామని ప్రకటించారు.



## తెలంగాణ భక్తులకు శ్రీవారి దర్శనాలు ప్రారంభం తొలిరోజు ఎంతమందో తెలుసా




**తిరుమల:**కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడిని తెలంగాణ నుంచి వచ్చే భక్తులు సిఫార్సు లేఖలపై దర్శించుకునే విషయంలో అడ్డంకులన్నీ తొలగిపోయాయి. దీంతో ముందుగా చెప్పినట్లే టీటీడీ ఇవాల్టి నుంచి తెలంగాణ నుంచి సిఫార్సు లేఖలతో వస్తున్న భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యాన్ని కల్పిస్తోంది. తిరుమలకు తెలంగాణ భక్తులు వెళ్లే విషయంలో అక్కడి సీఎం రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యల నేపథ్యంలో వీరి దర్శనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.తెలంగాణా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై మొదటిరోజు శ్రీవారిని భక్తులు దర్శనం చేసుకున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇవాళ ఓ ట్వీట్ చేశారు. తొలిరోజు 550 నుండి 600 మంది వరకు తెలంగాణా లెటర్స్ పై విఐపీ బ్రేక్ దర్శనాలను కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శ్రీవారి దర్శనభాగ్యం కల్పించిన సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గారికి ఉన్నతాధికారులకు భక్తులు ధన్యవాదాలు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. మంచి దర్శనం, వసతి కల్పిస్తున్న టీటీడీ అధికారులకు భక్తులు కృతజ్ఞతలు తెలుపుతున్న వీడియోను కూడా ఆయన షేర్ చేశారు.తెలంగాణా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై మొదటిరోజు శ్రీవారిని దర్శనం చేసుకున్న భక్తులుతొలిరోజు 550 నుండి 600 మంది వరకు తెలంగాణా లెటర్స్ పై విఐపీ బ్రేక్ దర్శనాలు కేటాయించిన టీటీడీవాస్తవానికి తెలంగాణ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనానికి భక్తుల్ని టీటీడీ అనుమతించే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. కానీ ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని నిలిపేసింది. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వ సంప్రదింపుల తర్వాత దీన్ని పునరుద్ధరించింది. ఇప్పుడు వారానికి రెండు రోజుల్లో ఇలా సిఫార్సు లేఖలపై దర్శనాలకు టీటీడీ అనుమతిస్తోంది. ఆదివారం, సోమవారం సిఫార్సు లేఖలను తీసుకుని, సోమ, మంగళవారాలు భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించనుంది. అది కూడా ఒక ప్రజా ప్రతినిధి ఒక సిఫార్సు లేఖను మాత్రమే అనుమతించనుంది. ఒక లేఖపై ఆరుగురికి మించకుండా శ్రీవారి దర్శనం కల్పించనుంది.

## రేషన్ కార్డులపై బిగ్ అప్డేట్ అవి రద్దు, పథకాలు దక్కాలంటే

**అమరావతి :**ఏపీ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు బిగ్ అప్డేట్ ఇచ్చింది. కొత్త రేషన్ కార్డుల జారీ పైన ఇప్పటి కే ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే సమయంలో బోగస్ కార్డుల ఏరివేతకు నిర్ణయించింది. ఇక, కార్డుల జారీతో పాటుగా.. పథకాలకు రేషన్ కార్డులు ప్రామాణికం కావటంతో కొనసాగింపు.. కొత్తవి జారీ పైన ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులు ఈ నెల 31లోపు ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేయాలని అన్ని జిల్లాల యంత్రాంగానికి ప్రభుత్వం తాజా ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వం తాజా ఆదేశాలుఏపీలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది మంది నిరీక్షిస్తున్నారు. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదు. ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలకు రేషన్ కార్డు ప్రాతిపదిక కావటంతో.. పథకాల లబ్ది దారులు



ఈ కార్డుల మంజూరు కోసం ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. అదే సమయంలో కార్డుల్లో మార్పుల చేర్పుల కోసం పెద్ద సంఖ్యలో లబ్ది దారులు నిరీక్షిస్తున్నారు. అర్హత లేకుండా కార్డులు పొందిన వారివి తెలిగించేలా ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తోంది. ఇక, ఇప్పుడు రేషన్ కార్డుల లబ్దిదారులు ఈ కేవైసీ తప్పని సరిగా చేసుకొనేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ ఆదేశించారు.ఈ కేవైసీ డెడ్ లైన్ఇకెవైసి యూనిట్లు రేషన్ డీలర్లు, తహాశీల్దార్లు, డిఎస్ఒల లాగిన్‌లలో యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మొబైల్ యాప్, రేషన్ షాపుల్లోని ఈ పోస్ పరిక రాల ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఇకెవైసి నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో రేషన్ కార్డుల ఈకేవైసీ ప్రక్రియ జోరుగా సాగు తున్నది. ఈకేవైసీ ప్రక్రియతో ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల ప్రక్షాళనతో పాటు బోగస్ ఏరివేతకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రేషన్‌కార్డుల్లోని లబ్ధిదారులందరి బయోమెట్రి క్ నమోదు చేయడంతో దాదాపుగా కార్డులు ప్రక్షాళన జరిగి వాస్తవ లబ్ధిదారులకు మాత్రమే రేషన్ పంపిణీ చేసేందుకు అవకాశం కలుగుతుందని డీలర్లు అంటున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న ఈకేవైసీని లబ్ధిదారులు చేయించకుంటే వారి కార్డు రద్దే అవశాలున్నాయని ప్రచారం సాగుతోంది. ఈకేవైసీ జరగని కారణంగా ఆ రేషన్‌కార్డు రద్దు జాబితాలో చేరుతుందని చెబుతున్నారు. దీంతో, రేషన్‌కార్డు లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయిం చుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు కోరుతున్నారు. దాదాపు 30 శాతం కార్డులకు ఇప్పటి కీ ఈ కేవైసీ పూర్తి కాలేదని సమాచారం. దీని కారణంగానే జిల్లా యంత్రాంగానికి తాజాగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. వచ్చే మే నెల నుంచి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు దిశగా కసరత్తు చేస్తోంది. ముందుగా లబ్ది దారుల ఖరారులో భాగంగా రేషన్ కార్డులను ప్రామాణికం గా భావిస్తున్నారు. దీంతో.. ఇప్పుడు రేషన్ కార్డుల కొనసాగింపు.. పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఈ కార్డులు – ఈ కేవైసీ ప్రక్రియ కీలకంగా మారుతోంది.

## తెలంగాణలో మంత్రివర్గం విస్తరణ కన్ఫార్మ్ ఛాన్స్ దక్కించుకునేది వీరే



**ఢిల్లీ :**తెలంగాణలో గత కొంతకాలంగా హాట్ టాపిక్ గా నడుస్తున్న మంత్రివర్గం విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుండగా.. 40వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి పయణమయ్యారు. ఈ క్రమంలోనే ఉగాది సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు హస్తినకు వెళ్లారు. ముందుగా కేసీ వేణు గోపాల్ తో నేతలంతా సమావేశం కానున్నారు. దీంతో ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కొత్త కార్యవర్గం, నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావిస్తున్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య అసెంబ్లీ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతం ఉండాలి. ఈ ప్రకారం తెలంగాణలో 18 మందికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం రాష్ట్ర క్యాబినెట్‌లో 12 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఖాళీగా ఉన్న 6 మంత్రి పదవులను ఈసారి అనౌన్స్ చేస్తారని పొలిటికల్ వర్గాల్లో జోరుగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే మంత్రివర్గ విస్తరణ.. పదవుల పైన ఢిల్లీ నేతలు ప్రతిపాదనలు కోరగా రాష్ట్ర నేతలు సమర్పించారు. ఇప్పుడు ఆ పేర్ల పైన సామాజిక – ప్రాంతీయ సమీకరణాలతో కూర్పు దిశగా కసరత్తు పూర్తి అయ్యిందని సమాచారం.అయితే ఇప్పుడు ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## లేటు వయసులో ఆ ప్రపంచ కుబేరుడి మరో పెళ్లి

**ఇటలీ :**మనవళ్లు, మునిమనవళ్లు తిన్నా తరగని ఆస్తి సంపాదించాడు. అమెరికా నుంచి ఇండియా దాకా 'అమెజాన్'ను బ్రాండ్ లా తీర్చిదిద్దాడు. ఒక రోజు వ్యాపారానికే కోట్లు వచ్చిపడుతాయి. అంత డబ్బుతోనే ప్రపంచ కుబేరుల్లో టాప్ 10లో జెఫ్ బెజోస్ ఉన్నారు. ఈ అమెజాన్ అధినేతకు అన్నీ ఉన్నాయి. కానీ విడాకులతో భార్య లోటు ఏర్పడింది. అందుకే 61 ఏళ్ల వయసులో మరో పెళ్లికి రెడీ అయ్యాడు ఈ కుబేరుడు.. కోటీశ్వరుడు మరీ.. ఎన్నైనా పెళ్లి చేసుకుంటాడు అంటూ అందరూ కామెంట్స్ చేస్తున్నారు.పపంచంలోనే రెండో అత్యంత సంపన్నుడు, ప్రముఖ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరోసారి వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. 2023లో తన ప్రియురాలు లారెన్ శాంచెజ్‌తో నిశ్చితార్థం చేసుకున్న ఆయన త్వరలోనే ఆమెను పెళ్లాడనున్నారని సమాచారం. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.., ఈ వేసవిలో ఇటలీలో వీరి వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది.వెనిస్ నగరంలో ఈ వేడుక జరగనుందని తెలుస్తుండగా, మరికొన్ని వర్గాలు మాత్రం బెజోస్‌కు ఇటలీ తీరంలో ఉన్న 500



మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన నౌకలో జూన్‌లో వివాహం జరగవచ్చని పేర్కొంటున్నాయి. గత ఏడాది ఫ్రాన్స్‌లో విహారయాత్రకు వెళ్లిన సమయంలో బెజోస్ లారెన్‌కు దాదాపు 2.5 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 21 కోట్లు) విలువైన గులాబీ రంగు వజ్రాల ఉంగరం ఇచ్చి ప్రపోజ్ చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.54 ఏళ్ల లారెన్ శాంచెజ్ గతంలో జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె పలు దాతృత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బెజోస్ – లారెన్ 2018 నుండి డేటింగ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే వారి సంబంధం 2019 వరకు బహిరంగంగా వెల్లడి కాలేదు. అదే సంవత్సరం జెఫ్ బెజోస్ తన భార్య మెకంజీ స్కాట్‌తో 25 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలుకుతూ విడాకులు తీసుకున్నారు. వారికి నలుగురు పిల్లలు ఉన్నారు. లారెన్‌తో తన బంధం అధికారికంగా వెల్లడించే వరకు బెజోస్ విడాకుల ప్రక్రియ పూర్తి కాలేదు.మరోవైపు, లారెన్ శాంచెజ్‌కు గతంలో పాట్రిక్ వైట్‌సెల్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంతేకాకుండా ఆమెకు మాజీ ఎన్‌ఎఫ్‌ఎల్ ఆటగాడు టోనీ గోంజలెజ్‌తో ఒక కుమారుడు కూడా ఉన్నాడు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈ జంట వివాహం గురించిన వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇటలీలోని అత్యంత రమణీయమైన ప్రదేశాలలో ఒకటైన వెనిస్‌లో లేదా ఆయన విలాసవంతమైన నౌకలో వీరి వివాహం ఎలా జరగనుందో చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వేడుకకు సంబంధించిన మరిన్ని అధికారిక ప్రకటనలు త్వరలోనే వెలువడతాయని భావిస్తున్నారు.

## మనుషులంత తెలివైనవి.. డాల్ఫిన్ల క్యూరియాసిటీ 'క్రూ డ్రాగన్'



**హైదరాబాద్:**ఫ్లోరిడా తీరానికి సమీపంలోని నీలిరంగు సాగర జలాల్లో ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్‌తో సహా నలుగురు వ్యోమగాములను సురక్షితంగా భూమికి చేర్చిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక మెల్లగా సముద్రంలో దిగింది. ఆ వ్యోమనౌకను ఒడ్డుకు తీసుకురావడానికి వేగంగా దూసుకొస్తున్న స్పీడ్‌బోట్ల సందడి మొదలైంది. ఇంతలో ఊహించని అతిథులు అక్కడికి చేరుకున్నారు. అవే ఒక డాల్ఫిన్ల గుంపు..ఆ నీటి గుర్రాలు ఉత్సాహంగా క్రూ డ్రాగన్ చుట్టూ తిరుగుతూ గెంతుతూ సందడి చేశాయి. వాటి మెరిసే చర్మాలు సూర్యకాంతిలో తళతళలాడుతుండగా, అవి వ్యోమనౌకను పరిశీలిస్తున్నట్లుగా కనిపించాయి. స్పీడ్‌బోట్లు దగ్గరవుతుంటే వాటి ముందు దూసుకుపోతూ తమదైన శైలిలో స్వాగతం పలికాయి. ఆ దృశ్యం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

డాల్ఫిన్లు ఎప్పుడూ అంతే! అవి సంఘజీవులు, చాలా తెలివైనవి. కొత్తగా ఏదైనా కనిపిస్తే వాటికి చూడాలనే కుతూహలం ఎక్కువ. అందుకే సముద్రంలో నౌకలు వెళుతుంటే వాటిని అనుసరిస్తూ, వాటితో ఆడుకుంటూ ఉంటాయి. ఈసారి అంతరిక్షం నుంచి వచ్చిన ఒక వింత నౌకను చూడటానికి అవి ఎంతగానో ఆసక్తి చూపించాయి.స్పీడ్‌బోట్లు వేగంగా కదులుతుండటంతో వాటి ముందుభాగంలో నీటి అలలు ఏర్పడ్డాయి. వాటిని 'బౌ వేవ్' అంటారు. డాల్ఫిన్లకు ఆ అలల మీద ప్రయాణించడం అంటే చాలా సరదా. అది వారికి ఒక రకమైన సర్ఫింగ్ లాంటిది. పెద్దగా కష్టపడకుండానే ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. అందుకే ఆ డాల్ఫిన్ల గుంపు ఆడుతూ పాడుతూ ఆ అలల వెంట సాగిపోయింది. వాటిలో కొన్ని డాల్ఫిన్లు అయితే ఆ ఒత్తిడి తరంగంలో తమకు అనువైన స్థానం కోసం ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నట్లుగా కనిపించాయి. ముఖ్యంగా బాటిల్‌నోస్ డాల్ఫిన్లు ఇలా బౌ వేవ్‌లో ప్రయాణించడానికి చాలా ఇష్టపడతాయి.

క్రూ డ్రాగన్ ల్యాండింగ్ సమయంలో నీటిలో ఏర్పడిన అలజడి, ఆ తర్వాత స్పీడ్‌బోట్ల హడావుడి ఆ డాల్ఫిన్ల దృష్టిని ఆకర్షించి ఉండవచ్చు. వాటి వెంట సునాయాసంగా ప్రయాణించాలనే ఉద్దేశంతోనే అవి అక్కడికి వచ్చి సందడి చేసి ఉంటాయి.

ఈ డాల్ఫిన్ల ప్రవర్తన కొత్తేమీ కాదు. అనాదిగా సముద్రాల్లో వేగంగా ప్రయాణించే నౌకలను డాల్ఫిన్లు అనుసరించడం మానవులు గమనిస్తూనే ఉన్నారు. ప్రాచీన గ్రీకు నావికులు అయితే డాల్ఫిన్లను పవిత్రమైన జీవులుగా భావించేవారు. సముద్ర దేవుడైన పొసైడాన్‌కు అవి దూతలుగా వచ్చేవని, తమకు అదృష్టాన్ని కలిగిస్తాయని నమ్మేవారు. కష్టమైన సముద్ర ప్రయాణాల్లో అవి తమను కాపాడతాయని వారి విశ్వాసం.

కొందరు శాస్త్రవేత్తలు మరో కారణం కూడా చెబుతున్నారు. బోట్లు సృష్టించే అలజడి వల్ల చేపలు, ఇతర చిన్న సముద్రజీవులు భయపడి అటూఇటూ పరుగులు తీస్తాయి. అప్పుడు డాల్ఫిన్లకు వాటిని వేటాడటం సులువు అవుతుంది. అందుకే డాల్ఫిన్లు నౌకలను వెంబడిస్తుంటాయని వారు అంటారు.కానీ ఆ రోజు ఫ్లోరిడా తీరంలో కనిపించిన డాల్ఫిన్ల ఉత్సాహం చూస్తుంటే, అవి కేవలం సరదాగా విహరించడానికి, తమ కుతూహలాన్ని తీర్చుకోవడానికే వచ్చాయని అనిపించింది. ఆ అంతరిక్ష నౌకను, దానిని తీసుకెళ్లడానికి వచ్చిన స్పీడ్‌బోట్లను చూసి అవి ఎంతగానో ఆనందించాయి.డాల్ఫిన్లు నిజంగా ప్రత్యేకమైన జీవులు. క్షీరదాలైనప్పటికీ అవి నీటిలో జీవిస్తాయి. తమ పిల్లలకు పాలిచ్చి పెంచుతాయి. గుంపులుగా కలిసి ఉంటాయి. ఒక్కో గుంపులో కొన్ని డజన్ల డాల్ఫిన్లు ఉంటాయి. కొన్నిసార్లు వేల సంఖ్యలో కలిసిపోయి 'సూపర్‌పాడ్'గా ఏర్పడతాయి. అప్పుడు అవి కలిసి వేటాడుతాయి. చేపల్లా కాకుండా డాల్ఫిన్లు నీటి అడుగున ఊపిరి పీల్చుకోలేవు. ఆక్సిజన్ కోసం అవి తరచూ నీటి ఉపరితలానికి రావాల్సి ఉంటుంది.నిద్రపోయే సమయంలో కూడా డాల్ఫిన్లు చాలా తెలివిగా ప్రవర్తిస్తాయి. వాటి మెదడులోని ఒక భాగం విశ్రాంతి తీసుకుంటుంటే, మరో భాగం చుట్టూ ఏం జరుగుతుందో కనిపెడుతూ ఉంటుంది. ప్రమాదం వస్తే వెంటనే మేల్కొంటాయి. అంతేకాదు, డాల్ఫిన్లు ఒకదానికొకటి ప్రత్యేకమైన పేర్లతో పిలుచుకుంటాయి. ఆ పేర్లు ఈలల్లాంటి శబ్దాల రూపంలో ఉంటాయి.ఆ రోజు క్రూ డ్రాగన్ చుట్టూ సందడి చేసిన డాల్ఫిన్ల గుంపు కూడా తమదైన శైలిలో ఆనందం వ్యక్తం చేసింది. సునీతా విలియమ్స్‌తో సహా ఆ నలుగురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకోవడం ఒక గొప్ప విషయం. ఆ క్షణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి ఆ డాల్ఫిన్ల సందడి. ఆ దృశ్యం ఎప్పటికీ అందరి మదిలో ఒక మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది. సముద్రపు లోతులనుంచి వచ్చిన ఆ ప్రత్యేక అతిథులు తమ ఉనికితో ఆ ల్యాండింగ్‌కు ఒక అద్భుతమైన ముగింపునిచ్చారు.

## సెగ్మెంట్ ముచ్చట: ఆ ఎమ్మెల్యేలు హాట్ బ్రో

**నరసరావుపేట:**ఏపీలో ఎమ్మెల్యేల తీరు ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఉండడం గమనార్హం. అన్ని వేళ్లు ఒకేలా ఉండన ట్టుగా.. టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు కూడా అలానే ఉన్నారు. కొన్నినియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వివాదాలకు వారు కేరాఫ్‌గా మారుతున్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు ఈ జాబితాలో ముందున్నారు. ఈ వరుసలోనే నరసరావుపేట ఎమ్మెల్యే చదల వాడ అరవిందబాబు కూడా చేరిపోయారు.ఇక, మరికొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పైకి శాంత స్వభావులుగా ఉన్నా.. చాపకింద నీరులా సొమ్ము లు పోగేసుకుంటున్నారు. వీరిని ప్రశ్నించే నాయకులు కూడా లేకపోవడం గమనార్హం. ఎవరైనా ప్రశ్నిస్తే.. వారికి కూడా అంతో ఇంతో ముట్టజెప్పి.. దారిలోకి తెచ్చుకుంటున్నారు. ఈ జాబితాలో విజయవాడ కు చెందిన ఓ ఎమ్మెల్యే పేరు జోరుగా వినిపిస్తోంది. ఇక, అనంతపురం నేతల విషయానికి వస్తే.. ఆధిపత్య రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారు.నియోజకవర్గాల్లో తమ మాటే చెల్లుబాటు కావాలని చాలా మంది నేతలు తపిస్తున్నారు. దీంతో వారి కారణంగా నిరంతరం.. నియోజకవర్గాల్లో అధికార–విపక్ష నాయకుల మధ్య, అధికార–అధికార నాయకుల మధ్య కూడా రగడ తెరమీదికి వస్తోంది. ఇదిలావుంటే.. ఒకరిద్దరు ఎమ్మెల్యేల తీరు మరింత భిన్నంగా ఉంది. వారు తినరు.. ఎవరినీ తిననివ్వరు.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ.. ఎక్కడో తేడా కొట్టి.. ఎమ్మెల్యేలు రోడ్డున పడుతున్నారు.కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఈ జాబితాలోకే వస్తున్నారు. కానీ, ఆమెకు అధికారులు ఎవరూ సహకరించడం లేదని తెలుస్తోంది. అవినీతి ఎవరు చేసినా ఊరుకునేది లేదని మాధవీ రెడ్డి చెబుతున్నారు. దీంతో అధి కార పార్టీకే చెందిన కొందరు నేతల



ప్రాజెక్టులు అనుమతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. ఇక, గతంలో ఫైర్‌బ్రాండ్ ముద్ర వేసుకున్న చింతమనేని ప్రభాకర్ వంటివారు.. ఇప్పుడు ప్రజలకు చేరువ అవుతున్నారు. ఇలా.. ఎమ్మెల్యేల తీరు.. వ్యవహార శైలి కూడా ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఉండడం గమనార్హం.

## ఖతార్ లో టెక్ మహీంద్రా ఉద్యోగి అరెస్టు..



**గుజరాత్ :**గుజరాత్ కు చెందిన ఒక ఐటీ ఉద్యోగి ఖతార్ లో పని చేస్తున్నాడు. ఆయన్నుఅక్కడి పోలీసులు డేటా చౌర్యం కేసులో అరెస్టు చేశారు. ఇదంతా జరిగి మూడు నెలలు కావటం.. ఇటీవల అతడి తల్లిదండ్రుల పుణ్యమా అని విషయం బయటకు రావటం.. ఆ అంశంపై వారు పోరాడుతున్న వేళలో.. సంస్థ స్పందించిన వైనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టు జరిగి మూడు నెలలు తర్వాత టెక్ మహీంద్రా సంస్థ ఈ విషయాన్ని బయటకు వెల్లడించటం గమనార్హం. కష్టసమ యంలో తమ ఉద్యోగికి.. వారి కుటుంబానికి తాము మద్దతుగా ఉంటామని టెక్ మహీంద్రా హామీ ఇచ్చింది. ఈ అంశంపై తాజాగా ఖతార్ లోని భారత రాయబారి కార్యాలయం స్పందించింది. ఇంతకూ అసలేం జరిగిందన్న అంశానికి సంబంధించి బాధితుడు తల్లి చెప్పిన వివరాల్ని చూస్తే.. ఆమె కొడుకు అమిత్ గుప్తా ఖతార్ లోని టెక్ మహీంద్రా కంపెనీలో మేనేజర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. డేటా చౌర్యం ఆరోపణలతో తన కొడుకును ఖతార్ పోలీసులు జనవరి 1న అదుపులోకి తీసుకున్నారు. 48 గంటల పాటు నీళ్లు.. ఆహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. మూడు నెలలుగా దోహాలో బంధించి ఉంచారన్న ఆమె.. 'నా కొడుకు నిర్దోషి. ఎవరో కావాలనే తప్పుడు కేసులో అతడ్ని ఇరికించారు. సంస్థలో ఎవరో తప్పు చేస్తే ఖతార్ – కువైట్ రీజియన్ కు హెడ్ స్థానంలో ఉన్న నా కొడుకును ఎలా అరెస్టు చేస్తారు? ఈ విషయాన్ని ఎవరూ కూడా మాకు చెప్పే ప్రయత్నం చేయలేదు. గడిచిన కొద్ది రోజులుగా మాకు మా అబ్బాయి ఫోన్ చేయటం లేదు. దీంతో అనుమానం వచ్చిన అతడి స్నేహితుడికి ఫోన్ చేస్తే అసలు విషయం తెలిసింది' అని జరిగిన వివరాల్ని వెల్లడించారు.తమ కొడుకును అరెస్టు చేశారన్న విషయం తెలిసినంతనే తాము దోహాకు వెళ్లి ఎంబసీ అధికారుల్ని కలిశామని.. అయినా లాభం లేకపోయిందన్నారు. తమ కొడుకును విడిపించేందుకు సాయం కోసం వడోదర ఎంపీ హేమాంగ్ జోషిని సాయం కోరగా.. ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగ అధికారులు మాట్లాడుతూ.. గుప్తా అరెస్టుపై ఖతార్ విదేశాంగ శాఖతో చర్చలు జరుపుతున్నామని.. అతడ్ని విడుదల చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై టెక్ మహీంద్రా స్పందిస్తూ.. తమ ఉద్యోగితో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని.. ఉంటామన్న హామీ ఇచ్చింది.

## తూప్రాన్ లో మైనంపల్లి హన్మంతరావు కు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



**తూప్రాన్, మార్చి24,** కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కు తూప్రాన్ లోని నర్సాపూర్ చౌరస్తాలో తాజా మాజీ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చిట్కుల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మైనంపల్లి హన్మంతరావు తూప్రాన్ మండలం యావాపూర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, తూప్రాన్ కాంగ్రెస్ నాయకులు నాగులపల్లి వెంకట్ రెడ్డి, పడాల్ పల్లి గౌతం గౌడ్, జీడిపల్లి గణేష్ గౌడ్, కౌన్సిలర్ కుమ్మరి రఘుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ అఫ్సర్ భాయ్, కుమ్మరి రమేష్, గరిగే నర్సింగ్ రావు, బల్ రాంరెడ్డి, పోతరాజు దన్ రాజు తో పాటు సుమారు వంద కార్ల కాన్వాయ్ తో రాగా రహదారి పై ఒక పెద్ద ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

## గంగమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి





**మెదక్ మార్చ్ 24** మెదక్ మండలం కొంటూరు చెరువు వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి జాతరలో పాల్గొని గంగమ్మ తల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి అనంతరం మహిళలతో కలిసి అమ్మవారికి ఓడిబియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి, తాజా మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, నాయకులు కిష్టయ్య, రవీందర్, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు పుట్టిన రోజు సందర్భంగా మెదక్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలకు 7 అంబులెన్సులు ప్రభుత్వ ఆస్పత్రికి కానుకగా ఇచ్చిన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు



**మార్చి 24 మెదక్** అందులో భాగంగా సోమవారం నాడు మెదక్ నియోజికవర్గం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్సు రఘునందన్ రావు ఆదేశం మేరకు మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధమల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిండెంట్ శివదయల్ డాక్టర్ సునీత మరియు కిరణ్ కీ అంబులెన్సు ను అందించడం జరిగింది. పేద ప్రజల సేవలకు ఉపయోగించాలని కోరడమైనది. ఈ కార్య క్రమంలో మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, రాగి రాములు జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ ఎం ఎన్ ఎల్ రెడ్డి జిల్లా ఉప అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్ అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్ పట్టణ మండల అధ్యక్షులు నాయిని ప్రసాద బెండల వీణ, శ్రీనివాస్, నవీన్ గౌడ్, బీకొండ రాములు బిజెపి నాయకులు శేఖర్, కల్కి నాగరాజు, రంజిత్ రెడ్డి, విటలేష్, రాము,సుంకోజ్‌రాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు

# మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

**పాపన్నపేట,మార్చి,24,** మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని సోమవారం పాపన్నపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా,అధ్యక్షులుగా కొత్తలింగాయిపల్లికి చెందిన కొత్త వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా బెజుగం విఠలేశ్వర్, కోశాధికారిగా గడ్డం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల మహిళా సంఘం కమిటీ అధ్యక్షురాలిగా కొత్త సరస్వతి, పధాన కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా జ్యోతి ఎన్నికయ్యారు.సంఘం నాయకులు నూతన కమిటీని సన్మానించారు.అధ్యక్షుడు వెంకటేశం మాట్లాడుతూ,సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.కొత్తపల్లి, పాపన్నపేట, చీకోడ్ సొసైటీ అధ్యక్షులు రమేష్ గుప్త, మల్లేశం, దత్తరాజు, పాపన్నపేట గ్రామ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ గుప్త, సంఘం నాయకులు అశోక్, రాజ్ కుమార్, రవీందర్, శ్రీనివాస్, రాములు, తదితరులున్నారు.





## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే

### ప్రజావాణి కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు



**మెదక్ మార్చి 24** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికేప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ప్రజావాణికి 85 దరఖాస్తులు వచ్చాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియ ంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. ధరణి సమస్యలు- 30, పెన్షన్-03, ఇందిరమ్మ ఇల్లు-03, ఉద్యోగ ఉపాధి పై-02, ఇతర సమస్యలు-47 మొత్తం ఈరోజు 85 దరఖాస్తులు ప్రజల నుంచి అందాయి ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# చదవడమనే కళ జీవితకాల అలవాటు కావాలి !

నేటి డిజిటల్ యుగంలో "లుకింగ్ కల్చర్ పెరుగుతూ, రీడింగ్ కల్చర్ సన్నగిల్లుతోంది". చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడం అంటే తెలియని విషయాలను తెలుసుకోవడం, అజ్ఞాన చీకట్ల నుంచి నుంచి జ్ఞాన వెలుగుల వైపు అడుగులు వేయడం. చదవడానికి ఏకాగ్రత కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. స్మార్ట్ ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకోండి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. ప్రపంచ పోకడలకు అనుగుణంగా మనం ఎదగడానికి అవసరమైనది చదువు మాత్రమే. విద్యార్థులు పాఠ్య పుస్తకాల చదువుకు తప్పనిసరిగా సమయం ఇస్తారు. వారు ఇతర పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. ఇతరులు కూడా జీవితాంతం పుస్తక పఠనాన్ని నిరంతరం కొనసాగించాలి. ఇతరుల అనుభవాలతో నేర్చుకున్న వారు తెలివైన విజ్ఞానవంతులు ! "స్వానుభవంతో నేర్చుకున్న వారు మూరు?లు, ఇతరుల అనుభవాలతో నేర్చుకున్న వారు విజ్ఞానవంతులు" అనే తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను" అనే విధంగా పుస్తకాలు కొనడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది. తెలివితో సరైన ఉద్యోగం దొరుకుతుంది. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. స్థిరత్వంతో సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను ఇస్తుందని తెలుసుకోవాలి. పుస్తకాలు కొని చదవకపోతేనే మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది. ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒక గంటైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏట వంద లేదా ఆ పైన పుస్తకాలు చదువే విధంగా మన జీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. చదవడానికి సమయం, సందర్భం అవసరం ఉందా !మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసినట్లయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు. మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్‌లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు. వారానికి 6 నుంచి 8 గంటలు చదివే అలవాటు ఉన్న వారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్న పుస్త పఠనానికి సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది. ఏ రకమైన పుస్తకాలు చదవాలి ! అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గూర్చి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదా వృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి కళ. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువరాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ పేట్టి గుర్తుంచుకోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి. చదవడానికి నియమ నిబంధనలు, సరైన సమయం సందర్భం అనేవి ఉండవు. పాఠకుడికి ఆసక్తి ఉంటే ఎడారిలో లేదా ఎండల్లో కూడా చదవవచ్చు. చదవడం వల్ల మనో విస్తృతి పెరుగుతుంది. సమాజం అర్థం అవుతుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ప్రజాదరణ పెరుగుతుంది. పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. చదివి అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెడితే మీ వ్యక్తిత్వం మరింత ఇనుమడిస్తుంది. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం కూడా అని గుర్తుంచుకోవాలి. చదువును దుకాణంలో కొనడాని వీలు కాదు కాని పుస్తకాన్ని కొని జ్ఞానాన్ని ఆర్జించవచ్చుని మరిచి పోరాదు.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## తూప్రాన్ లో 40 మంది ఆశా వర్కర్ల అరెస్టు



### పోలీస్ స్టేషన్ కు తరలింపు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు.. ఆశా వర్కర్ల అరెస్ట్

**తూప్రాన్,మార్చి 24,** నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ జిల్లా ఇందల్ వాయి, సిరికొండ నుండి సి.ఐ.టి.యు పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న ఆశా వర్కర్లను తూప్రాన్ పట్టణ 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద ఎస్.ఐ శివానందం ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేసి దాదాపు 40 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం వారిని తూప్రాన్ పోలీస్ స్టేషన్ కు తరలించి సాయంత్రం స్వంత పుచిక పై విడుదల చేసి వారి స్వగ్రామాలకు పంపించారు. సీఐటీయూ పిలుపు మేరకు ఆశా వర్కర్లు హైదరాబాద్ తరలి వెళ్తుండడంతో వాహనాల తనిఖీ చేపట్టారు. మరి కొంత మంది ఆశా వర్కర్లను గుర్తించి వెల్దుర్తి, శివంపేట పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వారిని స్వంత పుచ్చిక పై విడుదల చేసి తిరిగి వారి వారి స్వంత ఉర్లకు పంపించారు.

## బానిసత్వ రహిత భారత నిర్మాణం

# అసాధ్యమా

(25 మార్చి "అంతర్జాతీయ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" సందర్భంగా)ప్రపంచ చరిత్రలో 16 - 18వ శతాబ్ద కాలంలో ఆఫ్రికా నుంచి సెంట్రల్/మిడిల్ అమెరికాకు బలవంతంగా అమాయక ఆఫ్రికన్లను తరలించి బానిసలుగా సంకెళ్ల వేసి, వెట్టిచాకిరీ చేయించిన దుర్మార్గపు ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఈ దుర్ఘటన "ట్రాన్స్అట్లాంటిక్ బానిసత్వ వ్యాపారం"గా చరిత్ర పుటల్లోకి చేరింది. ఈ విషాదకర ఘటన ప్రభావం నేటికీ ఆఫ్రికన్ల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. యూఎస్‌లో 01 ఫిబ్రవరి 1865న బానిసత్వాన్ని నిషేధించడం జరిగినప్పటికీ జాతి వివక్ష, బానిస బతుకుల ప్రభావం నేటికీ ఆఫ్రికన్ సమాజంపై పడుతూనే ఉంది. 2007లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 25 మార్చిన "అంతర్జాతీయ ట్రాన్స్అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. అమానవీయ బానిసత్వం నేరమని, మానవ హక్కుల ఉల్లంఘనలు ఆక్షేపణీయం అని, జాతి వర్ణ వర్గ వివక్ష దురాచారమని, మనిషిని మనిషిగా చూడడం మన కనీస బాధ్యత అని అవగాహన కల్పించడం జరుగుతోంది. అగ్రదేశాల హెూటల్స్, రెస్టారెంట్లు, సెలూన్లు, వ్యవసాయ పనులు, సంగీత కార్యక్రమాల్లో బానిసత్వ దురాచారం నేటికీ కొనసాగుతున్నది. భారతంలో బానిసత్వ దురాచారం: ప్రపంచంలోనే అత్యధికంగా 39 శాతం ఆధునిక బానిసలు భారత్‌లోనే ఉన్నారని తెలుస్తోంది. ముస్లిమ్ పాలనలో బానిసత్వం పెరగడం, నేటి డిజిటల్ వెలుగుల్లో కూడా బానిసత్వ చీకట్లు కమ్మడం సోచనీయం. 1843లో భారత్ బానిసత్వ చట్టం అమలులోకి రావడం జరిగినా దాని ప్రభావం అంతగా పౌర సమాజంపై పడకపోవడం దురదృష్టకరం. 2018 నివేదిక వివరాల ఆధారంగా ప్రపంచంలో 46 మిలియన్ల బానిసలు ఉండగా, అందులో 8 మిలియన్లు భారత్‌లోనే ఉండడం విచారకరం. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, బాల్య వివాహాలు, బలవంతపు పడుపు వృత్తి, బాల కార్మిక వ్యవస్థ లాంటివి నేటికీ మన సమాజంలో కనిపించడం బాధాకరం. ఇండి యాలో ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు బానిస చీకటి బతుకులు బతుకుతున్నట్లు తేలింది. ఇటుక బట్టీలు, చిరు పరిశ్రమలు, వ్యవసాయం, అసంఘటిత రంగాలు, గృహ సంబంధిత పనులు, బాల్య బానిసత్వ దురాచారాల్లో ఆధునిక బానిసత్వ కదలికలు కనిపిస్తున్నాయి. ఆధునిక బానిసత్వానికి అడ్డుకట్ట వేయడానికి కఠినంగా చట్టాల అమలు, ప్రజల్లో చైతన్యం, బడాబాబుల ఆలోచనల్లో మార్పు రావలసి ఉన్నది. ప్రజల ఆకలిని ఆసరాగా తీసుకొని అమానవీయ బానిసత్వ బంధీఖానాలో కట్టిపడేయడం మూర?త్వం, నేర సమానం. అందరం చేయి చేయి కలిపి మానవ హారం పట్టి బానిసత్వ కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్న అమాయక జీవులకు స్వేచ్ఛను కల్పించి బానిసలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం, అందరి ముఖాల్లో ఆనంద హరివిల్లులు వికసింపజేద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## శ్రీ కోదండ రామాలయం పున ప్రారంభించిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ మేనేజ్మెంట్



**మెదక్ మార్చి 24** మంబోజి పల్లి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ ఆవరణలోని కోదండరామలయం గత తొమ్మిది సంవత్సరాలుగా మూసివేయబడినది సోమ వారం ఉదయం 10గంటలకు నిజాం షుగర్ ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ శ్రీ కోదండరామలయం ద్వారం తెరచి దేవాలయం యొక్క భాధ్యతలను కాశి సత్యనారాయణ రెడ్డి భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శి ర్యాలమడుగు కి ఫ్యాక్టరీ యాజమాన్య ఉద్యోగి బుల్ రెడ్డి మరియు ఉమాపతి కి అందజేయడం జరిగింది అ దేవిధంగా కాశి సత్యనారాయణ రెడ్డి తన మిత్రబృందం సభ్యులైన మల్లెం నారాయణ, గంజి నవీన్, కుమ్మరి నర్సింలు,మేకల గంగాధర్, దమ్ము యాదగిరి, గురజాల తిరుపతి రెడ్డి, జి. కిషన్, నల్ల ప్రశాంత్, శ్రీధర్ రావు, సచిన్ బన్సాల్, భోల మహెందర్లను దేవాలయం పరిరక్షణ కార్యకారణి సభ్యులుగా సంఘ్ పరివార్ అధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంబోజి పల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మల్లన్న స్వామి కళ్యాణం లో పాల్గొన్న మెదక్ మాజీ ఎమ్మెల్యే యం పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా పాపన్నపేట మండలం మార్చి 24**
పాపన్నపేట మండలం తమ్మాయిపల్లి గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి , కళ్యాణ మహెూత్సవానికి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మెన్ లావణ్య రెడ్డి మాజీ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు తాడేపు సోములు, ఏడుపాయల దేవస్థానం మాజీ ఛైర్మెన్ బాలగౌడ్ , మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ పోలీస్ వెంకట్రాంరెడ్డి రెడ్డి, మండల మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు జగన్, మాజీ ఎంపీపీ దుర్గయ్య,తాజా మాజీ సర్పంచ్ లు శ్రీనాథ్ లింగారెడ్డి, మల్లేశం, గ్రామ అధ్యక్షులు సుభాష్ రెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, శ్రీశైలం, సాయిలు, మనోహర్, రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కడప మేయర్ అవినీతిపై విచారణ

**కడప, మార్చి24:**పలు ఆరోపణల నేపథ్యంలో కడప మేయర్, వైసీపీ నేత సురేశ్ బాబుపై విజిలెన్స్ విచారణ పూర్తయింది. దీంతో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.మేయర్ పదవి నుంచి ఎందుకు తొలగించకూడదో 15 రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో మేయర్ సురేశ్ బాబుకు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ షోకాజ్ నోటీసులపై సమాధానం చెప్పాలంటూ మేయర్ సురేష్ బాబును టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ క్రమంలో సోమవారం విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. నగరంలో మేయర్ సురేష్ బాబు తన ఇష్టా రీతిగా కాంట్రాక్ట్‌లు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి.

# ధరలపై నియంత్రణ ఏదీ !



ఓ వైపు రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం ధరలను నియంత్రించే వారు లేకుండా పోయారు. చౌకబియ్యం మాత్రం 45 ఏళ్ల తరవాత కూడా రూపాయికే లభిస్తున్నాయి. అందుకే తెల్ల రేషన్ కార్డుల కోసం జనం ఎగబడుతున్నారు. తమకు కార్డు రాలేదంటే తమకు రాలేదని దరఖాస్తులు చేస్తున్నారు. దీనికితోడు సన్నబియ్యం ఉగాది నుంచి సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇంకేముందు అమ్ముకునే వారికి మరింత ఆదాయం దక్కగలదు. ఇప్పటికే రేషన్ బియ్యం మాఫియా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నా ...ఎక్కడా దాడులు జరడం లేదు. ఇకపోతే నిత్యావసర ధరల్లో క్రమంగా మళ్లీ వంటనూనెల ధరలు పెగుతున్నాయి. ఉల్లిపాయల ధరలు రిటైల్‌లో 30 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. శక్కర, పప్పుల ధరలు కూడా సామాన్యలకు అందకుండా పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ధరలు అదుపు కావడం లేదు. ధరలను అదుపుచేసే వ్యవస్థ తమ చేతుల్లో లేదన్న రీతిలో ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయి. గృహనిర్మాణ రంగం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దీనిని అదుపు చేసేలా స్టీల్, సిమెంట్ ఇతర గృహనిర్మాణ రంగ వస్తువుల ధరలను అదుపు చేయలేకపోతున్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో ఈ అంశాలను ఎజెండా చేసుకుని నేతలను నిలదీయాల్సిన అవసరంఉంది. నేతల మాటల ప్రలోభాలకు, డబ్బులకు లొంగితే వారు మనపై స్వారీ చేస్తారని తేలిపోయింది. అందువల్ల ఉచిత పథకాలకు లొంగరాదన్న జ్ఞానాన్ని పొందడం లేదు. వారిచ్చే డబ్బులకు లొంగడంతో పాలన కూడా తమ ఇష్టానుసారంగా చేసుకుంటున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో వాటిపై చర్చించడం లేదు. చట్టసభల్లో అవి చర్చకు రావడం లేదు. అన్ని పార్టీలు వ్యూహాత్మకంగా తమ ఎజెండా అంశాలపైనే చర్చిస్తున్నాయి. పార్లమెంట్ కావచ్చు, రాష్ట్రాల అసెంబ్లీలు కావచ్చు జరుగుతున్న తంతు ఇదే. ధరల నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో ప్రజలు తమ దగ్గరికి వ్చేనేతలను అడగాలి. ఎందుకు ధరలను నియంత్రించలేక పోతున్నారో ప్రశ్నించాలి. అచ్ఛేదిన్ మాటలకే పరిమితం అయ్యింది. ధరలు తరచూ పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆందోళన పరుస్తున్నాయి. నిజానికి ధరలు తగ్గించడమెలా..ఖర్చులు తగ్గించుకోవడమెలా అన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. తమ ఖర్చులను పైసా కూడా తగ్గించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డ పాలకులు ఉన్నంతకాలం గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం భవిష్యత్ ఆలోచన లేని పాలకలు ప్రజలకు గుదిబండగా మారారు. ప్రజల నుంచి వసూలుల చేసిన పన్నులతో విలాసాలు చేస్తున్నారు. దర్పంగా కాలం వెళ్లదీస్తున్నారు. ముందుగా పాలకులు పెడుతున్న ఖర్చులపై చర్చ చేయాలి. మనం కడుతున్న పన్నులతో వారు విమానాలు, ఎసి కార్లలో తిరుతూ పాలన చేస్తున్నారు. విదేశాలతో పోలిస్తే మన దేశంలో పాలకుల విలాసాలు చాలా ఎక్కువ. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి. అందుకే వ్యాపారులు ధరలు పెంచడం, పాలకలు చూసీ చూడనట్లుగా ఉండడం ..సామాన్యులపై ఇది మోయ లేని భారంగా మారింది. రోజురోజుకూ నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల పేదప్రజలను బతకలేని స్థితికి చేర్చింది. సామాన్యుల జీవితాలను గమనంలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరెంట్ తదితర ఛార్జీలను పెంచి నడ్డి విరుస్తున్నారు. బెంగుళూరు లాంటి నగరాల్లో మంచినీటి కటకటలను ముందే గుర్తించడం లేదు. నీటి సమస్యలు రాకుండా ఓ పదేళ్ల ప్రణాళికలు రచించడం లేదు. పెరుగుతున్న ధరలతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దీనికితోడు జిఎస్టీ పేరుతో చేస్తున్న పన్ను వసూళ్లు కూడా నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, నూనె ధరలు భగ్గుమంటుండగా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంను పట్టించుకోకుండా ధరలు పెంచి పెనుభారం మోపడం తగదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవల్సిందే. ప్రభుత్వాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. దుబారాను అదుపు చేయాలి. అప్పుడే దేశంలో ధరలను అదుపు చేయగలం అని గుర్తించాలి. దీనిపై ముందుగా ఎన్నికల్లో చర్చించాలి. పాలకుల జల్సా ఖర్చులపై, వారికి ఇస్తున్న టిఎ,డిఎలపై చర్చించాలి. ఆ దమ్ము పాలకులకు,ప్రతిపక్షాలకు ఉందా లేదా అన్నది చర్చించాలి. దేశంలో గత పదేళ్ల కాలం నాటి ధరలను బేరీజు వేసుకుని చర్చ చేయాలి. స్టీల్, సిమెంట్ ధరలు కూడా అదుపు లేకుండా పోయాయి. సామాన్యులకు గృహం అన్నది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డ విషయంగా మారింది. మధ్య తరగతి ప్రజలు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేకుండా చేశారు. పెరుగుతున్న నిర్మాణ రంగం వ్యవయంతో పాటు రిజిస్ట్రేషన్, జిఎస్టీ ఛార్జీలు మోత మోగిస్తున్నాయి.

# ఎలక్ట్రిక్ వాహనాలకు భారీగా ప్రోత్సాహకాలు





## విద్యుత్ ఛార్జింగ్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి

**న్యూఢిల్లీ,మార్చి24:** ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండు మూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగ గనుంది. కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలంఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గతంలోనే ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# ఆధార్ అడ్రస్ మారితే అన్నింట్లోనూ మార్పు

## - డిజిలాకర్‌లో మార్పులపై కేంద్రం ఆలోచన




**న్యూఢిల్లీ,మార్చి24:** ఆధార్‌లో చిరునామాను మారిస్తే అన్ని పత్రాల్లోనూ ఆటోమేటిక్‌గా మారిపోయే వెసులుబాటును కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా డిజిలాకర్‌లో మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ఇది అందుబాటులోకి వస్తే ఒక్క ఆధార్‌లో మార్చుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. మారిన చిరునామాను ఆధార్‌లో అప్‌డేట్ చేస్తే సరిపోతుంది. దీంతో పాన్‌కార్డు, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు వంటి అన్ని పత్రాల్లోనూ చిరునామా దానంతట అదే మారేలా డిజిలాకర్‌ను సులభతరం చేసేందుకు యుఐడిఎఐ యత్నిస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల సహకారంతో దీన్ని సాకారం చేయనుంది. ఆధార్ కార్డులో చిరునామా మారితే డిజిలాకర్‌లో స్టోర్ అయిన డ్రైవింగ్ లైసెన్స్‌లోనూ చిరునామా మారేలా ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతో చర్చలు ఆరంభించింది. ఆదాయ పన్ను శాఖ సహకారంతో పాన్ కార్డులోనూ ఇలాంటి మార్పులకు వీలు కల్పించటంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఆధార్‌కార్డులో చిరునామా మారితే మిగతా పత్రాల్లో వివరాలను విడివిడిగా అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు- డ్రైవింగ్ లైసెన్స్‌లో చిరునామాను మార్చుకోవాలంటే కేంద్రీకృత పోర్టల్‌లో విడిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి, రవాణా శాఖ కార్యాలయ అధికారులకు సమర్పించాల్సి వుంటుంది. అయితే ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఇటువంటి ఇబ్బందులు వుండవని యుఐడిఎఐ వెల్లడిస్తోంది. దీంతో అన్ని పత్రాల్లోనూ మార్చేందుకు వేర్వేరు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది.

# కత్తులు నూరుతున్న పార్టీలు



## పరస్పర విమర్శలతో వేడెక్కిన తెలంగాణ

**హైదరాబాద్,మార్చి24:** తెలంగాణలో టీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దూకుడుగా తమ రాజకీయాలకు పదును పెడుతున్నాయి. ఎవరికి వారు పరస్పర విమర్శలతో వ్యూహ రచనలకు పూను కుంటున్నారు. ప్రత్యర్థులకు ఆలోచనలకు అందకుండా వ్యూహాలు రచించేస్తున్నారు. బిఆర్‌ఎస్ లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ విమర్శలకు దిగుతున్నారు. గతంలో పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనా పాపాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి పాలనాతీరుపై ప్రజల్లో చర్చ చేస్తున్నారు. ఆయన పట్ల ప్రజల్లో ఆరాధనా భావం పోయిందని, అసలు రంగు బయటపడుతోందని బిఆర్‌ఎస్, బిజెపలు విమర్శకు పదను పెడుతున్నాయి. ఆరు గ్యారెంటీలు మాయమయ్యాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఎదురుదాడి చేస్తున్నాయి. ఏదైనా చేయగలడన్న నమ్మకం ఇప్పుడు కెసిఆర్‌పై బలపడిందని బిఆర్‌ఎస్ చెబుతోంది. మరోవైపు పాలనా వైఫల్యాలను కూడా ఎండగడుతున్నది. మరోవైపు రానున్న రోజుల్లో కెసిఆర్ వ్యూహం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో ఆ పార్టీకి గడ్డుపరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బిజెపి, కాంగ్రెస్ లక్ష్యంగా కెటిఆర్ విమర్శలకు దిగుతున్నారు. డీలిమిటేషన్ పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. స్థానిక ఎన్నికల్లో గెలవడం ఈ మూడు పార్టీలకు అవసరం. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీ నేతలు సైతం తమ సర్వే ఫలితాల్లో పార్టీ ఏ చోట బలహీనంగా ఉంది.. ప్రజలు దృష్టిని ఆకర్షించేందుకు వేయాల్సిన ఎత్తుగడలేంటని కసరత్తు మొదలెట్టారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బిఆర్‌ఎస్‌కు ప్రత్యమ్నాయంగా నిలిచింది. సిఎంగా బాధ్యతలు చేపట్టాక అందరినీ కలుపుకోని వెళ్తున్న రేవంత్ రెడ్డికి అంతర్గత సమస్యలు చికాకు పెడుతున్నాయి. కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం సడలుతోంది. అందుకు స్థానిక ఎన్నికల కోసం బిసి రిజర్వేషన్లు, కులగణన, వంటి అంశాలను అన్ని పార్టీలు బలంగా చటుతున్నాయి. ఎన్నికల నాటికి సిద్ధమయ్యేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి.

తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం, 25 మార్చి 2025


# ఖలీల్‌పై టాంపరింగ్ ఆరోపణలు?

## - సోషల్ మీడియాలో వీడియో హల్చల్



2025 ఐపీఎల్?లో బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. చెపాక్ వేదికగా ఆదివారం ముంబయితో జరిగిన మ్యాచ్?లో చెన్నై బౌలర్ ఖలీల్ అహ్మద్ బాల్ ట్యాంపరింగ్?కు పాల్పడ్డాడంటూ క్రికెట్ ఫ్యాన్స్ ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో ఖలీల్ అహ్మద్ తన జేబులో నుంచి ఏదో తీసి చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు ఇచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో రుతురాజ్– ఖలీల్ బాల్ ట్యాంపరింగ్?కు పాల్పడ్డారని క్రికెట్ ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. ఈ బాల్ ట్యాంపరింగ్ అంశం సోషల్ మీడియాను కుదిపేస్తోంది. చెన్నై సూపర్ కింగ్స్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిందని, అందుకే ఆ జట్టును బ్యాన్ చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫిక్సర్లను ఐపీఎల్ నుంచి శాశ్వతంగా నిషేధించాలని పోస్టులు పెడుతున్నారు. ఈ వీడియో పెద్ద చర్చకు దారి తీసింది. అసలు వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఏంటా? అని చర్చించుకుంటున్నారు.అయితే ఖలీల్ తన జేబులోంచి చిన్న అట్ట ముక్కలాంటిది రుతురాజ్?కు ఇచ్చి ఉంటాడని ఆరోపిస్తున్నారు. అలా అట్టముక్కతో బంతిపై రుద్దితే స్వింగ్ చేసే బౌలర్లకు ఆ బంతి బాగా సహకరిస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా ఈ వీడియో మాత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్?గా మారింది. దీంతో ఈ బాల్ ట్యాంపరింగ్ అంశంపై బీసీసీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.

# మ్యాచ్ మధ్యలో తమిమ్ ఇక్బాల్‌కు గుండెపోటు

## ● హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో అతడు రెండుసార్లు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో తమిమ్?ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తమీమ్ పరిస్థితి సీరియస్?గానే ఉందట. అతడికి వెంటిలేటర్‌పై ట్రీట్?మెంట్? అందిస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేబాశీష్ చౌధురి వెల్లడించారు. ఢాకా ప్రీమియర్ లీగ్‌లో భాగంగా సోమవారం మహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్– షినెపుకర్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ లీగ్?లో తమిమ్ మహమ్మగన్ క్లబ్?కు కెప్టెన్?గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో తమీమ్ టాస్ కోసం మైదానంలోకి వచ్చాడు. మరికాసేపట్లో మ్యాచ్ ప్రారంభం అవుతుందనగా, అతడికి సడెన్?గా ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి పరీక్షించగా స్వల్ప గుండెపోటుగా గుర్తించారు. గుండెపోటు అని తేలడం వల్ల తమిమ్?ను ఢాకా తరలించేందుకు హెలికాప్టర్ ఏర్పాటుచేశారు. కానీ, హెలిప్యాడ్‌కు వెళ్తుండగా మరోసారి హార్ట్ ఎటాక్?కు గురయ్యాడు. దీంతో తిరిగి అదే ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారని దేబాశీష్ వెల్లడించారు. అటు తమిమ్ ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అతడు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.





# ఇషాన్ కిషన్‌కు గాయం

## రాబోయే మ్యాచ్‌లలో ఆడతాడా?



ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి విజయాన్ని అందుకుంది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్ల తుక్కు రేగొట్టింది. అయితే ఈ మ్యాచ్‌కు సంబందించిన ఓ వీడియో మాత్రం ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌ను కంగారు పెట్టిస్తోంది. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేసి కదంతొక్కిన ఇషాన్ కిషన్ గాయపడి కిందపడి గిలగిల కొట్టుకుంటున్న వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ గాయంతో ఏమైనా చేస్తుందా అని టెన్షన్ పడుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంలో ఇషాన్ కిషన్‌దే కీలక పాత్ర. ఇషాన్ కిషన్ 47 బంతుల్లో నాటౌట్‌గా 106 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు. అయితే ఇదే మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ ఇషాన్ కిషన్ బౌండరీ వద్ద గాయపడ్డారు. రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్‌లోని 18వ ఓవర్‌లో జరిగిందీ ఘటన. ఇషాన్ కిషన్ బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న టైంలో గాయపడ్డారు. బంతిని ఆపేందుకు యత్నించాడు. బంతి మాత్రం బౌండరీ దాటేసింది. కానీ ఇషాన్ కిషన్ నొప్పితో బాధపడుతున్నట్లు కనిపించాడు. గాయపడిన తర్వాత, మళ్ళీ ఫీల్డింగ్ కోసం మైదానంలోకి తిరిగి రాలేదు. బౌండరీ ఆపేందుకు ట్రై చేసి గాయపడిన ఇషాన్ కిషన్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బౌండరి ఆపలేకపోయినా మోకాలికి గాయమైన సంగతి అందులో స్పష్టంగా కనిపిస్తోంది. బాధతో కుంటుతూ నడిచే వీడియోను షేర్ చేస్తూ ఏమైందని ఫ్యాన్స్ ఆరా తీస్తున్నారు. ఇషాన్ కిషన్ గాయం తీవ్రం కాకూడదని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యాజమాన్యం, అభిమానులు ఆశిస్తున్నారు.సన్‌రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్ రాయల్స్‌ను 44 పరుగుల తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఇషాన్ కిషన్ 47 బంతుల్లో 106 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ట్రావిస్ హెడ్ 31 బంతుల్లో 67 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇచ్చిన 286 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు వచ్చిన రాజస్థాన్ రాయల్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేయగలిగింది. రాజస్థాన్ రాయల్స్ తరపున ధ్రువ్ జురెల్ 35 బంతుల్లో 70 పరుగులు చేశాడు. సంజు సామ్సన్ 37 బంతుల్లో 66 పరుగులు చేశాడు. హెట్‌మైర్ 23 బంతుల్లో 42 పరుగులు చేశాడు. శనివారం ప్రారంభమైన ఐపీఎల్‌లో మొత్తం ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు జరిగాయి. అందులో చెన్నై సూపర్ కింగ్స్ (%జూఖ%) ముంబై ఇండియన్స్ (%వీ×%)ను ఓడించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని ముంబై ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (%ూ=ఎ%) రాజస్థాన్ రాయల్స్ (%==%)ను 44 పరుగుల తేడాతో ఓడించింది. తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఆర్సీబీ ఓడించింది. ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌ల తర్వాత పాయింట్ల పట్టికలో పాట్ కమ్మిన్స్ నాయకత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ 2 పాయింట్లు, 2.200 నికర రన్ రేట్‌తో టాప్‌లో ఉంది. తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 పాయింట్లు, 2.137 నికర రన్ రేట్‌తో రెండో స్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ రెండు పాయింట్స్, నెట్ రన్ రేట్ 0.493తో మూడో స్థానంలో ఉంది. టాప్–3 జట్ల పాయింట్లు సమానంగా ఉన్నప్పటికీ నెట్ రన్ రేట్ ఆధారంగా స్థానాలు ఉన్నాయి.



# ధోనీని స్లెడ్జ్ చేసిన దీపక్ చాహర్..

## - తన దైన శైలిలో రిప్లై ఇచ్చిన ధోనీ

ఐపీఎల్ 2025లో ఆదివారం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ బ్యాటర్ ఎంఎస్ ధోనీని ముంబై ఇండియన్స్ పేసర్ దీపక్ చాహర్ స్లెడ్జ్ చేయాలని చూశాడు. అతను బ్యాటింగ్ కు వచ్చిన సమయంలో సిల్లీ మిడాఫ్ లో నిలబడి, చప్పట్లు చరుస్తూ దీపక్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. అదే విధంగా ఏదో మాట్లాడుతూ.. చిన్నగా స్లెడ్జింగ్ చేసినట్లు అనిపించింది. దీంతో చెన్నై స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది.అయితే అప్పటికే చెన్నై విజయం ఖాయం అయిపోవడంతో తను సరదాగానే ఇలా చేస్తున్నట్లు అందరికీ అర్థం అయింది. ఇక ఈ మ్యాచ్ లో ధోనీ రెండు బంతులాడి పరుగలేమీ చేయలేదు. మరో ఓపెనర్ రచిన్ రవీంద్ర సిక్సర్ తో మ్యాచ్ ను ముగించాడు. మ్యాచ్ ముగిశాక ప్లేయర్లు కరచాలనం చేసేటప్పుడు అత్యుత్సాహం ప్రదర్శించిన చాహర్ కు తన దైన శైలిలో రిప్లై ఇచ్చాడు. తాజాగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. అభిమానులు తమకు తోచిన కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లు చేస్తున్నారు. ప్లేయర్లు కరాచలనం చేసేటప్పుడు తన దగ్గరికి వచ్చిన చాహర్ ను చూసి నవ్వుతూ, తన బ్యాట్ తో వెనకాల ధోనీ ఒక్కటిచ్చాడు. ఈ సీన్ అక్కడున్న వారిని పులకరింప చేసింది. నిజానికి ధోనీ, చాహర్ మధ్య గురు శిష్యుల అనుబంధం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. అనామకంగా ఉన్న చాహర్ ను సీఎస్కేలోకి తీసుకుని, తనని మేటి పేసర్ గా మలిచాడు ధోనీ. అతని శిక్షణలో రాటు దేలిన చాహర్.. ఏకంగా టీమిండియాలోకి అరంగేట్రం చేశాడు. ఇప్పుడు ముంబైకి ప్రధాన పేసర్లలో ఒకడిగా మారాడు. ఐపీఎల్లో ముంబో మరో చెత్త రికార్డును మూటగట్టుకుంది. సీజన్ తొలి మ్యాచ్ ను వరుసగా 13వ సారి ఓడిపోయిన జట్టుగా నిలిచింది. ఎప్పుడో 2012లో సీజన్ తొలి మ్యాచ్ ను గెలిచిన ముంబై, ఆ తర్వాత ఆడిన ప్రతి తొలి మ్యాచ్ ఓడిపోతూ వస్తోంది. ఈ మ్యాచ్ లో కెప్టెన్ మారిన ముంబై రాత మారలేదు. కొత్త సారథి సూర్య కుమార్ యాదవ్ సైతం జట్టును గెలిపించలేక పోయాడు. ఇక ఐపీఎల్లో ముంబైపై చెన్నై ఆధిపత్యం కొనసాగుతోంది. కరోనా తర్వాత ఆడిన ఏడు మ్యాచ్ ల్లో ఆరింటిలో చెన్నై విజయం సాధించింది. దీంతో ఈ సీజన్లో సొంతగడ్డపై ఆడిన తొలి మ్యాచ్ లో విజయం సాధించిన రెండో టీమ్ గా నిలిచింది.





# తమ్ముడిపైనే సోదరి సెటైర్లు!

ముంబై ఇండియన్స్ స్టార్ పేసర్ దీపక్ చాహర్‌పై అతని సోదరి మాలతి చాహర్ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. తన సోదరుడు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కట్టప్పలా వెన్ను పోటు పొడిచాడని సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దీపక్ చాహర్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అటు బ్యాట్‌తో.. ఇటు బంతితో సత్తా చాటాడు. ముఖ్యంగా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28 పరుగులతో అజేయంగా నిలిచి ముంబై ఇండియన్స్‌కు 155 పరుగుల పోరాడే లక్ష్యాన్ని అందించాడు. అనంతరం బౌలింగ్‌లో ఓ వికెట్ తీసాడు. అయితే గత సీజన్ వరకు దీపక్ చాహర్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో అతన్ని ముంబై ఇండియన్స్ రూ. 9.25 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. వేలంలో దీపక్ చాహర్ కోసం పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ తీవ్రంగా పోటీ పడింది. దీపక్ చాహర్ కోసం సీఎస్‌కే కూడా గట్టిగా ప్రయత్నించింది. కానీ ముంబై భారీ ధర పెట్టడంతో వెనకడుగు వేసింది. తొలి మ్యాచ్‌లోనే దీపక్ చాహర్ ఆ డబ్బులకు న్యాయం చేశాడు. దీపక్ చాహర్ ప్రదర్శనను ఉద్దేశించి మాలతి చాహర్.. ఇన్‌స్టా వేదికగా బాహుబలి సీన్‌లోని కట్టప్ప వెన్ను పోటు పొడిచే సన్నివేశాన్ని షేర్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. చాహర్ వెన్ను పొటు పొడిచాడనే ఉద్దేశంతో ధోనీ కూడా మ్యాచ్ అనంతరం అతన్ని బ్యాట్‌తో బాదాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసింది. సూర్యకుమార్ యాదవ్(26 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 29), తిలక్ వర్మ(25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 31)టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో దీపక్ చాహర్(15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. అనంతరం సీఎస్‌కే 19.1 ఓవర్లలో 6 వికెట్లకు 158 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది.

# సన్‌రైజర్స్ రికార్డులు చూస్తే వణుకు పుట్టాల్సిందే

ఊహించినట్లుగానే సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి తన బ్యాటింగ్ పవర్ చూపించింది. ఐపీఎల్ 2025లో ఉప్పల్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పరుగుల సునామీ సృష్టించింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికిఆరేశారు హైదరాబాద్ బ్యాటర్లు. అంతేకాదు ఐపీఎల్ చరిత్రలోనే రెండవ అత్యధిక స్కోరు సాధించి రికార్డుల్లోకి ఎక్కారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టుకు మంచి ఆరంభం లభించింది. మొదటి 6 ఓవర్లలో 94 పరుగులు రాబట్టింది. ఇది ఐపీఎల్ చరిత్రలో పవర్‌ప్లేలో నమోదైన మూడవ అత్యధిక స్కోరు. ఈ లిస్టులో మొదటి రెండు రికార్డులు కూడా హైదరాబాద్ పేరిట ఉన్నాయి. హైదరాబాద్ ప్లేయర్ ఇషాన్ కిషన్.. ఆ ఫ్రాంచైజీ తరపున తొలి మ్యాచ్ ఆడగా.. మొదటి మ్యాచ్‌లోనే 45 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఇది ఐపీఎల్ 2025లో తొలి సెంచరీ కాగా.. కిషన్ ఐపీఎల్ కెరీర్‌లోనూ మొదటి సెంచరీ కావడం విశేషం. మరోవైపు టీ20లలో ఇప్పటిదాకా నాలుగు 250ం స్కోర్లు చేసి రికార్డు సృష్టించింది సన్‌రైజర్స్. అలాగే ఈ ఒక్క మ్యాచ్‌లోనే ఏకంగా 528 పరుగులు వచ్చాయి. హైదరాబాద్ 286 రన్స్ చేయగా.. చేదనలో రాజస్థాన్ 242 పరుగులు చేసింది. దీంతో ఇది ఐపీఎల్ చరిత్రలోనే రెండో అత్యధిక స్కోర్ కావడం గమనార్హం. ఇరు జట్ల ఆటగాళ్లు 30 సిక్సర్లు, 51 ఫోర్లు బాదారు. అటు రాజస్తాన్ రాయల్స్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఈ మ్యాచ్‌లో 76 పరుగులు సమర్పించుకుని.. చెత్త గణాంకాలను నమోదు చేశాడు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం





# లుక్స్‌పై కాకుండా.. పనితనంపై దృష్టిపెట్టండి..

**● మిల్కీబ్యూటీ కామెంట్‌పై తమన్నా రియాక్షన్**

తమన్నా తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. ఈ అమ్మడు విజయ్ వర్మతో డేటింగ్ చేస్తోంది. అయితే గతంలో తమన్నా తనను మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ తో పిలవొద్దు అని చెప్పింది. తనకు మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ ఇవ్వొద్దు అని తెలిపింది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ ట్యాగ్ గురించి ప్రస్తావించింది. తమన్నా భాటియాను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం గురించి ఆమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఓదెల 2' సినిమా ప్రమోషన్ సందర్భంగా తమన్నాను ఓ రిపోర్టర్ ఇలా అడిగారు: "ఒక మిల్కీ బ్యూటీలో శివశక్తి ని చూడాలని ఎలా అనిపించింది.?" దీనికి తమన్నా స్పందిస్తూ, తనను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం తనకు సమస్య కాదని, అయితే తన పాత్రల ద్వారా తన సామర్థ్యాన్ని చూపించడంపైనే ఎక్కువ దృష్టి పెడతానని చెప్పింది. ఆమె మాటల్లో, "నన్ను మిల్కీ బ్యూటీ అని పిలవడం గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ నేను ఈ సినిమాలో శివశక్తి పాత్రను పోషిస్తున్నాను, ఇది ఒక ఆధ్యాత్మిక శక్తితో కూడిన పాత్ర. నా పాత్రల ద్వారా నా నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడమే నా లక్ష్యం." అని తెలిపింది. ఆమె తన లుక్స్‌పై కాకుండా తన పనితనంపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది తమన్నా.

# మన అవార్డులను లాగేసుకుంటున్నారు : దీపికా పదుకొణె



మన దేశంలో ఎంతోమంది ప్రతిభ ఉన్న నటీనటులున్నారనీ, అయితే చాలాసార్లు మనకు రావలసిన అవార్డులను లాగేసుకున్నారని దీపికా పదుకొణె కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. "భారతదేశం సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు ఏమాత్రం గుర్తింపు రాలేదు. 'చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్‌లను లాగేసుకున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్'లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఇది మన సినిమా అని ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం కలిగింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ది బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను" అని అన్నారు. 2023 ఆస్కార్ వేడుకలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని నాటునాటుని పాటనుఉ దీపిక ప్రేక్షకులకు పరిచయం చేశారు. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు' ఇదే..' అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడం విశేషం.



# కుర్రాళ్ల మతిపోగుడుతున్న బాంధవి శ్రీధర్

బాంధవి శ్రీధర్ .. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ చిన్నది 2022లో విడు దలైన "మసూద" అనే తెలుగు సినిమాలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంలో ఆమె దెయ్యం పట్టిన అమ్మాయి పాత్రలో నటించి, తన నటనా ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. ఈ సినిమా బాంధవి శ్రీధర్ మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. దాంతో ఆఫర్స్ కూడా క్యూ కట్టాయి. బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా అడుగుపెట్టడానికి ముందు చైల్డ్ ఆర్టిస్ట్‌గా కూడా పనిచేసింది. ఆమె "మిస్టర్ పర్‌ఫెక్ట్", "రభస", "మొగుడు", "రామయ్య వస్తావయ్య", "మజ్ను" వంటి తెలుగు సినిమాల్లో చిన్న పాత్రల్లో కని పించింది. అయితే, "మసూద" సినిమాతోనే ఆమెకు హీరోయిన్‌గా పెద్ద బ్రేక్ లభించింది. అంతేకాకుండా, బాంధవి శ్రీధర్ అందాల పోటీల్లో కూడా విజయం సాధించింది. ఆమె 2019లో "మిస్ ఇండియా రన్నరప్"గా నిలిచింది, అలాగే "మిస్ ఇండియా ఫ్యాషన్ ఐకాన్ 2019" మరియు "మిస్ ఇండియా మిస్ ఆంధ్రప్రదేశ్ 2019" టైటిల్స్‌ను గెలుచుకుంది. ప్రస్తుతం బాంధవి శ్రీధర్ తెలుగు చిత్ర పరిశ్రమలో మరిన్ని మంచి అవకాశాల కోసం చూస్తోంది. అలాగే సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. తన గ్లామరస్ లుక్స్ తో నెటిజన్స్ ను కట్టిపడేస్తుంది బాంధవి. తాజాగా ఈ చిన్నది కొన్ని అందమైన ఫోటోలు షేర్ చేస్తుంది. బోల్డ్ అండ్ బ్యూటీ ఫుల్ ఫోటోలను వదిలింది. ఈ ఫోటోలకు కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. త్వరలోనే ఈ బ్యూటీ ఆకట్టుకునే సినిమాతో వస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# వీటీ15పై వరుణ్‌తేజ్ ఆశలు

**- హార్రర్, కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో మూవీ**

టాలీవుడ్ యాక్టర్ వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం వీటీ15. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కొరియన్ కనకరాజు (వీటీ15 వర్కింగ్ టైటిల్) ఫస్ట్ లుక్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. ఈ మూవీ సోమవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ఘనంగా మొదలైంది. మేర్లపాక గాంధీ, క్రిష్, హీరోయిన్ రితికానాయక్ ఇతర టీం మెంబర్స్ సమక్షంలో ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ చిత్రాన్ని టాప్ ప్రొడక్షన్ హౌస్ యూవీ క్రియేషన్స్ ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ తెరకెక్కిస్తోంది. మేర్లపాక గాంధీ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ డైరెక్టర్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. కాగా వీటీ 15 ఫస్ట్ లుక్‌లో డ్రాగన్ డిజైన్ ఉన్న జాడిపై కోడ్ లాంగ్వేజ్‌తో ఉన్న క్లాత్ మంటలు అంటుకొని అనుమానాస్పదంగా కనిపిస్తుండగా.. సస్పెన్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో సినిమా ఉండబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఇక వేట హాస్యాస్పదంగా మారితే అంటూ పోస్టర్‌లో రాసిన క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచేస్తుంది. వరుణ్ తేజ్ చివరగా మట్కా సినిమాలో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. ఎఫ్ 3 తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ మేర్లపాక సినిమాపై భారీగానే ఆశలు పెట్టుకున్నాడు.

# ఆమె కూతురితో నటించటానికి కూడా సందేహించను : సల్మాన్‌ఖాన్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సికందర్. ఈ సినిమాకు మురుగదాస్ దర్శకత్వం వహించారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ మార్చి 30న ఈద్ పండుగ కానుకగా థియేటర్లలోకి రానుంది. అయితే, ఈ సినిమాలో రష్మిక, సల్మాన్ మధ్య ఏజ్ గ్యాప్‌పై నెట్టింట తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఏజ్ గ్యాప్ వివాదంపై సల్మాన్ స్పందించారు. ఈ మేరకు విమర్శకులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నాకు, హీరోయిన్ రష్మికకు మధ్య దాదాపు 31 ఏళ్ల వయసు తేడా ఉందని కొందరు అంటున్నారు. ఏజ్ గ్యాప్ విషయంలో రష్మికకు ఎలాంటి ప్రాబ్లమ్ లేదు. ఆమె తండ్రికి కూడా సమస్య లేదు. వాళ్లకే లేని సమస్య మీకు ఎందుకు..? రష్మికకు పెళ్లయ్యాక ఆమె కూతురితో కూడా నటిస్తా. వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?' అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం సల్మాన్ రియాక్షన్ నెట్టింట వైరల్ అవుతోంది. బాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో సికందర్ ఒకటి. కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు. రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. మంచి స్పందన లభించింది.



# ఆమె అందానికి హద్దులు లేవు

అందాల ముద్దుగుమ్మ బాలీవుడ్ నటి దిశా పటానీ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. లోఫర్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు అంతగా అవకాశాలు రాలేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ బ్యూటీ వరస సినమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. గ్లామర్ పాత్రలతో కుర్రకారును మాయ చేస్తుంది. అయితే తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో పలు ఫోటోలు పోస్టు చేసింది. అందులో ఐపీఎల్ ఓపెనింగ్ అంటూ షేర్ చేసిన ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దిశా తాజాగా ఐపీఎల్ 2025 ఓపెనింగ్ సెరోమణిలో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. క్రిస్టల్స్‌తో తయారు చేయించిన డ్రెస్‌లో తన అందాలను ఆరబోతస్తూ, డ్యాన్స్ పుర్ఫామెన్స్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండటంతో, దిశా పటాని అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ అమ్ముడు అభిమానులు.

